ఈనాడు
మహబూబాబాద్

బుధవారం 23 ఆగస్టు 2017 | 16 పేజీలు



హెల్మెట్‌తోనే రక్షణ

మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద కలెక్టర్ ప్రీతిమీన, ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం హెల్మెట్‌ధారుల ర్యాలీని ప్రారంభించారు. ఇది పలు ప్రాంతాల మీదుగా రైల్వేసెంటరు వరకు సాగింది. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ మన రక్షణ కోసం, మన కుటుంబం కోసం హెల్మెట్ ధరించాలని అన్నారు. వివరాలు.. 3లో

యువతరాన్ని కోల్పోతున్నాం! వివరాలు 3లో..

100% స్వచ్ఛత మధ్యపేజీల్లో

ఆదర్శ మార్కెట్‌గా కేసముద్రం మధ్యపేజీల్లో

మట్టి గణపతిపై మనసేది?



- పర్యావరణ హితంపై కానరాని ప్రచారం
- ప్రోత్సహించని అధికార యంత్రాంగం
- మళ్లీ పెరగనున్న పీవోపీ విగ్రహాలు

ఈనాడు, వరంగల్

వినాయక చవితి అంటేనే పర్యావరణ హితానికి పెట్టింది పేరు. ఎన్నో రకాల పత్రాలతో గణనాథుడిని కొలుస్తాం. అందుకే రసాయనాలతో చేసిన విగ్రహాలను కాకుండా, మట్టితో రూపొందించినవి పూజించాలని కొన్నేళ్లుగా ప్రచారం ఊపందుకొంది. ప్రజలూ అందుకు అనుగుణంగా మారుతున్నా.. నూరు శాతం అమలు కావడం లేదు. ఇప్పటికీ పీవోపీవే ఎక్కువగా వాడుతున్నారు. వీటిని పూర్తిగా నిర్మూలించి, మట్టి వైపే మళ్లాలంటే ప్రభుత్వం కీలక బాధ్యత తీసుకోవాలి. అందరిలో అవగాహన కల్పించాలి. ఈ సంవత్సరం అధికార యంత్రాంగం దాన్ని పూర్తిగా మరిచిపోయింది. ఎక్కడా ఆ ఊసే కనిపించడం లేదు. గతంలో వరంగల్ నగరంలో భారీ ఎత్తున ప్రచారం చేయడమే కాకుండా, ప్రజలకు ఎన్నో సౌకర్యాలు కల్పించింది. పండక్కి నెల ముందు నుంచే హడావుడి చేసింది. ప్రస్తుతం అధికారులకు పట్టింపు లేకుండా పోయింది. మిగతా జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఫలితంగా మట్టి విగ్రహాల సంఖ్య మళ్లీ తగ్గుతోంది.

నాటి స్ఫూర్తి ఏదీ?

నిరుడు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేకంగా పిల్లలతో మట్టి వినాయకుల విగ్రహాలు తయారు చేయించి, ప్రజలకు ఉచితంగా ఇచ్చారు. కార్పొరేషన్ నుంచి ఉచితంగా విగ్రహాల తయారీదారులకు మట్టిని అందించారు. భద్రకాళి చెరువు సమీపంలో మట్టిని తవ్వి సరఫరా చేశారు. దీనికోసం ప్రత్యేకంగా కొందరు అధికారులు విధులు నిర్వర్తించారు. ఈ ఏడాది అలాంటి ఏర్పాట్లేవీ లేవు. మరో వైపు మంత్రి కేటీఆర్ పట్టణాల్లో కాలుష్యాన్ని తగ్గించే క్రమంలో మట్టి వినాయకులను బాగా ప్రోత్సహించాలని చెబుతున్నా, ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి చర్యలు లేవు. ప్రభుత్వ విభాగాలేవీ అధికారికంగా ఒక్క సమావేశమూ ఏర్పాటు మిగతా 2లో...

ఒంటికి వస్తే ఇంటికే!



పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో తలుపులేని మరుగుదొడ్లు


- ప్రభుత్వ పాఠశాలల్లో సరిపోని మరుగుదొడ్లు, మూత్రశాలలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

మహబూబాబాద్: (న్యూస్‌టుడే బృందం)

సర్కారు బడుల బలోపేతానికి ఏటా రూ. వేల కోట్లను కేటాయిస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు.. పాఠశాలలు తెరిచే సమయానికి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదు.. ఇప్పటికీ జిల్లాలోని అనేక విద్యాలయాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు.. ఉన్నా వినియోగంలో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు...

పరిశీలన

జిల్లాలో 895 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 27,073 మంది అబ్బాయిలు, 27,283 మంది మిగతా 2లో...



నర్సింహులపేట మండలం పెద్దనాగారం ప్రాథమిక పాఠశాలలో తలుపులేని మరుగుదొడ్డి

ఇకపై ఆధార్ తప్పనిసరి!

నేటి నుంచి రవాణా శాఖలో అమలు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: ఆర్టీఏ ఆన్‌లైన్ సేవల్లో ఇకపై ఆధార్ నెంబరు తప్పనిసరిగా నమోదు చేయాల్సిందే. చరవాణి సంఖ్యనూ కచ్చితంగా పేర్కొనాల్సిందే. మంగళవారం నుంచి ఈ విధానం ప్రారంభం కానుంది. గతంలోనే ఈ పద్ధతిని ప్రవేశపెట్టినా.. పలు కారణాలతో వాయిదా పడింది. తాజాగా పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రవాణా శాఖ సిద్ధమైంది. ఆధార్, చరవాణి నెంబర్లను నమోదు చేస్తేనే ముందస్తు ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ అయ్యేలా మార్పులు చేసింది. ఆన్‌లైన్‌లో ఒక చరవాణి నెంబరును ఐదుసార్లు కంటే ఎక్కువగా నిక్షిప్తం చేస్తే తీసుకోదు. మరొకటి నమోదు చేయాలని కోరుతుంది. ఈ చర్యలతో ఇక నుంచి దళారులకు చెక్ పడనుంది.

ఎన్‌ఎస్‌జీ కమాండోలొచ్చారు!

వరంగల్ క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ కేంద్ర కారాగారం నుంచి గత ఏడాది ఇద్దరు ఖైదీలు తప్పించుకొని వెళ్లడం కలకలం సృష్టించింది. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. సిబ్బందిపై వేటు వేసింది. తర్వాత దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తాజాగా భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు, రక్షణలో సిబ్బందికి మెలకువలు నేర్పించడానికి దిల్లీ, ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న 110 మంది నేషనల్ సెక్యూరిటీ గార్డు (జాతీయ భద్రత సిబ్బంది)లను పిలిపించింది. వీరు బుధవారం కారాగారాన్ని సందర్శిస్తారు. భద్రత చర్యలపై ప్రదర్శన ఇస్తారు. కొన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తారు. అనంతరం వరంగల్ రూరల్ జిల్లా దామెర మండలం ఊరుగొండ పవర్ గ్రిడ్‌లోని సిబ్బందికీ తర్ఫీదునిస్తారు.



ఒంటికి వస్తే ఇంటికే!

(మొదటిపేజీ తరువాయి)

అమ్మాయిలు చదువుకుంటున్నారు. వీరి సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించ లేదు. మరికొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇంకొన్ని చోట్ల నీటి వసతి లేదు. అన్నీ ఉన్నా తలుపులు లేనివి ఎన్నో ఉన్నాయి. ఫలితంగా వాటిని వినియోగించడం సాధ్యం కావట్లేదు. కీలకమైన ఈ అంశాన్ని పట్టించుకోకపోవడంతో తిప్పలు ఎదురవుతున్నాయి. అనేక బడుల్లో బారులు తీరుతున్నారు. ఈ నేపథ్యంలో చదువుపై మక్కువ చూపడం లేదు.

డుమ్మాకొడుతున్న పిల్లలు

సర్కారీ పాఠశాలల్లో విద్యార్థినులే ఎక్కువ మంది ఉన్నారు. అయినా మౌలిక సదుపాయాల్లో ముఖ్యమైన మూత్రశాలలు, మరుగుదొడ్ల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఈ సమస్యను ఎవరికీ చెప్పుకోలేక అమ్మాయిలు నరకయాతన పడుతున్నారు. నెలలో ఐదు రోజుల పాటు విద్యాలయాలకు రావట్లేదు. దీని వల్ల చదువులో వెనుకంజలో ఉంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటు బాట పడుతున్నారు.

మండలాల వారీగా పరిస్థితి ఇదీ...

★ డోర్నకల్ నియోజకవర్గ కేంద్రం. మేజర్ గ్రామ పంచాయతీ. ఇక్కడున్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నాలుగు మరుగుదొడ్లు/మూత్రశాలలున్నా బాలికలు ఒకటే వాడుతున్నారు. అలాగని ఇక్కడ వారు తక్కువగా ఉన్నారనుకోనేరు. 282 మంది చదువుకుంటున్నారు. మిగతావి మహిళా ఉపాధ్యాయులు, ఒక మహిళా అటెండర్ ,పురుష ఉపాధ్యాయులు, బాలురు, వికలాంగులు వినియోగిస్తున్నారు. ఇతర పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులున్న చోటల్లా ఒక మరుగుదొడ్డి/మూత్రశాల తలుపునకు తాళం తప్పనిసరిగా వేస్తున్నారు. మిగతా వాటిని గాలికి వదిలేస్తున్నారు.

★ కొత్తగూడ మండలంలోని బత్తులపల్లిలో రెండు మరుగుదొడ్లు పని చేయడం లేదు. మూత్రవిసర్జన కోసం బయటికి వెళ్తున్నారు. ఎదుళ్లపల్లిలో ఒకటి ఉండగా.. మహిళా ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాల పిల్లలు వినియోగిస్తున్నారు. ఓటాయిలో మూత్రశాలలు సరిపోకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

★ మహబూబాబాద్ మండలంలోని కంకర బోడ్ ఉన్నత పాఠశాలలో 282 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 142 మంది అమ్మాయిలున్నారు. ఏడు మూత్రశాలలుండాలి. ఆరే ఉన్నాయి. ఇందులో రెండే పనిచేస్తున్నాయి. వీటి వద్ద వరుస కడుతున్నారు. పత్తిపాకలోని ప్రాథమిక పాఠశాలలో రెండు మూత్రశాలలున్నాయి. తలుపులు లేకపోవడంతో ఆరుబయటకు వెళ్తూ కష్టాలు ఎదుర్కొంటున్నారు.

★ దంతాలపల్లి మండలంలోని రేపోణి ప్రాథమిక, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో 184 మంది విద్యార్థులు ఉన్నారు. రెండే మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నాయి. ఇటీవల మరో నాలుగు నిర్మించినా నిరుపయోగంగా మారాయి. దాట్ల ఉన్నత పాఠశాలలో 156 మందికి కేవలం మూడే ఉండడంతో బయటికెళ్తున్నారు.

★ చిన్నగూడూరు మండలంలోని జయ్యారం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో 217 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. రెండింటికి కేవలం మూడు మరుగుదొడ్లే ఉన్నాయి. వీటిలో నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థినులు బకెట్లలో తీసుకెళ్తున్నారు.

★ నెల్లికుదురు మండలంలోని చాలా విద్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. పైపులు, తదితర సామగ్రి మరమ్మతుల గురయ్యాయి. అయినా ప్రధానోపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

ఇబ్బందులు రాకుండా చూస్తాం..

–వి.నాగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను గుర్తించాం. ఎస్ఎస్ఏ, ఉపాధి పథకం ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపడుతాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాం.

మట్టి గణపతిపై మనసేది?

(మొదటిపేజీ తరువాయి)

చేయకపోవడం గమనార్హం. మట్టి గణపతుల వల్ల కలిగే ప్రయోజనం, పీఓపీ వల్ల కలిగే నష్టాల గురించి వాట్సప్, ఫేస్‌బుక్‌లలో ప్రచారం హోరెత్తుతోంది. స్వచ్ఛంద సంస్థలు తమ బాధ్యతగా ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో కొంత వరకు అవగాహన వస్తోంది.

నగరంలో 6000లకు పైనే..

హైదరాబాద్ తర్వాత ఎక్కువ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేది వరంగల్ లోనే. త్రినగరి పరిధిలో దాదాపు 6000లకు పైగా మండపాల్లో భారీ విగ్రహాలను నెలకొల్పి నవరాత్రులు నిర్వహిస్తారు. వరంగల్ ఐదు జిల్లాల వ్యాప్తంగా 10,000 విగ్రహాలపైనే కొలువుదీర్చి పూజలు చేస్తారు. ఇక ఇళ్లలో పెట్టుకునే చిన్ని విగ్రహాలను కలిపితే దాదాపు లక్ష వరకు ఉంటాయి. నగరంలో వినాయకులను తయారుచేసే కేంద్రాలు పదికిపైనే ఉన్నాయి. ఇటీవల మట్టి విగ్రహాలపై ఉద్యమం వచ్చాక వీటి తయారీలోనూ కళాకారులు ఎన్నో నైపుణ్యాలు సాధిస్తున్నారు. గతంలో చిన్న పరిణామంలో మాత్రమే చేసేవారు. ఇప్పుడు 15 అడుగుల ఎత్తులో ఆకర్షణగా రూపొందిస్తున్నారు. వీటికి వాటర్ కలర్స్ వేస్తూ కట్టిపడేసే విధంగా తీర్చిదిద్దుతున్నారు. అయినా ఈ విషయం ప్రజల్లోకి అంతగా వెళ్లట్లేదు.

ఇవీ దుష్ఫలితాలు

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల అనేక దుష్ఫలితాలు ఉన్నట్లు పర్యావరణ వేత్తలు ఎన్నో ఏళ్లుగా చెబుతున్నారు. చాలా ఎత్తు విగ్రహాలను తయారీ చేయడానికి ప్రమాదకరమైన రసాయనాలను వినియోగిస్తున్నట్లుగా అనేక పరిశీలనల్లో వెల్లడైంది. వీటిని చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల ఆ నీరు కలుషితమై జలచరాలతోపాటు, మనుషులపై ప్రభావం పడుతోంది.

రోగాలు రావడం ఖాయం..: డాక్టర్ అప్పయ్య, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

విగ్రహాలకు వేసే రంగుల్లో లెడ్ ఉంటుంది. నిమజ్జనం చేసే చెరువులు, నదుల్లో దిగి స్నానం చేసినప్పుడు రంగు నీళ్లకు సంబంధించిన రసాయనాలు శరీరంలోకి వెళ్తాయి. కాలేయం, నరాలు దెబ్బతింటాయి. చర్మవ్యాధులు వెంటాడుతాయి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారుచేసే విగ్రహాలను పూజించి వాటిని చెరువుల్లో నిమజ్జనం చేయడం మనకే ప్రమాదం.

చెరువులను కలుషితం చేయొద్దు..: రవీందర్, ఐబీ ఈఈ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

విషపూరితమైన రంగులతో తయారుచేసిన వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేస్తే నీరంతా కలుషితం అవుతుంది. నీటిలో జీవించే జలచరాలకు ప్రమాదమే. ఈ నీటిని మనుషులు, పశువులు తాగినా రోగాలొస్తాయి. తాగునీటి చెరువుల్లో ఎట్టి పరిస్థితుల్లో రంగులతో కలిసి ఉన్న విగ్రహాలను నిమజ్జనం చేయొద్దు.

నిలిచిన వాహనాలు

ప్రయాణికుల అవస్థలు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: ఎస్సీ కాలనీ ఇరుకు రహదారి వెంట ఒక వైపు కంకర లారీ, మరో వైపు ఇసుక లారీ సమాన దిశలో దిగబడి పోవడంతో సుమారుగా నాలుగు గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మంగళవారం ఉదయం రెండు లారీలు దిగబడి పోవడంతో ఎస్సీ కాలనీ వాసులతో పాటు ఇరు రాష్ట్రాల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భారీగా లారీలు నిలిచిపోయిన తొలగించడంలో అధికార యంత్రాంగం జాప్యం చేయడంతో ప్రయాణికులు, ఇతర వాహనాదారులు అసహనం వ్యక్తం చేశారు. చివరకు కాళేశ్వరం పోలీసుల సూచనలతో ఈ ప్రాంతంలో పనులు నిర్వహిస్తున్న నిర్మాణకుల జేసీబీ సహాయంతో లారీలను బయటకు తీయడంతో వాహనదారులు హమ్మయ్యా అంటూ పయణం అయ్యారు.



వరుస క్రమంలో నిండు ఇసుక లారీలు

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

గొల్లగూడెం(అశ్వాపురం), న్యూస్‌టుడే: మణుగూరు ప్రధాన రహదారిపై గొల్లగూడెం మూలమలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేటకు చెందిన లోకు నాగరాజు(31) భద్రాచలం నుంచి తన ద్విచక్రవాహనంపై మణుగూరు వైపునకు వస్తున్నాడు. గొల్లగూడెం మూలమలుపు వద్దకు రాగానే వర్షం కారణంగా అతని ద్విచక్రవాహనం రహదారిపై అదుపుతప్పి జారి కిందపడి పోయాడు. దీంతో నాగరాజు తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అశ్వాపురం ఎస్సై పి.సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నాగరాజు మణుగూరులో తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు.

వేదపండితుడి జీతం స్వాహా చేయడం తప్పు కాదా?

తెలంగాణ అర్చక, ఉద్యోగ ఐకాస కన్వీనర్ భానుమూర్తి

రామన్నపేట, న్యూస్‌టుడే: ఐనవోలు దేవాలయంలో పనిచేస్తున్న వేదపండిట్ పురుషోత్తమ్‌శర్మ వేతన బకాయిని స్వాహా చేయడం తప్పు కాదా, అక్రమాలను కప్పి పుచ్చుకోవడానికి కార్యనిర్వాహణాధికారి శేషభారతి అర్చకులపై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసమని తెలంగాణ అర్చక, ఉద్యోగ ఐకాస కన్వీనర్ గంగు భానుమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురుషోత్తమ్‌శర్మ వేతన బకాయిని గతేడాది నవంబరులో బ్యాంకు నుంచి డ్రా చేశారని, అతనికి ఇవ్వకుండా నానా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. డిపార్ట్‌మెంట్ ఆడిటర్ లక్ష్మీనారాయణ అభ్యంతరం వ్యక్తం చేసిన తర్వాత వేదపండిట్‌కు వేతన బకాయి ఇవ్వడానికి ప్రయత్నాలు చేశారన్నారు. నగదు రూపేణా తీసుకునేందుకు అంగీకరించకపోవడంతో నేరుగా పురుషోత్తమ్‌శర్మ బ్యాంకు ఖాతాలో జమ చేశారని భానుమూర్తి ఆరోపించారు. ఇదే విషయాన్ని సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లుగా వివరించారు.

టీకా వికటించి విద్యార్థికి దద్దుర్లు

బుధరావుపేట(ఖానాపురం), న్యూస్‌టుడే: మీజిల్స్, రుబెల్లా (ఎంఆర్) టీకా వికటించి విద్యార్థికి దద్దుర్లు రావడంతో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది నర్సంపేట ప్రభుత్వ ప్రాంతీయాసుపత్రికి తరలించి వైద్య సేవలందించారు. మంగళవారం గ్రామ పరిధిలోని చిలుకమ్మనగర్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న వాసం చందుకు వైద్య సిబ్బంది ఎంఆర్ టీకా వేశారు. కాసేపటికి విద్యార్థి కళ్లుతిరిగి పడిపోయాడు. అక్కడే ఉన్న ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు మృదుల వెంటనే నర్సంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒంటిపై దద్దుర్లు వచ్చాయని విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన ఎంఈఓ పూర్ణచందర్‌రావు తెలిపారు.

నిట్‌లో టెక్నోజియాన్ థీం ఆల్కెమీ ఆవిష్కరణ

అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో ఫెస్ట్ నిర్వహణ

నిట్‌క్యాంపస్(వరంగల్), న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మక వరంగల్ జాతీయ సాంకేతిక విద్యాసంస్థ(ఎన్ఐటీ) విద్యార్థులు ఏటా ఎంతో క్రేజీగా నిర్వహించే టెక్నోజియాన్ థీం ఆల్కెమీ (ఇనుమును బంగారంగా మార్చడం) లోగోను బుధవారం రాత్రి క్యాంపస్ ఆవరణలో ఆవిష్కరించారు. నిట్‌లోని ప్రధాన పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న మైదానంలో విద్యార్థి బృందం కేరింతల నడుమ టెక్నోఫెస్ట్ లోగోను ఆవిష్కరించారు. ఈ ఏడాది టెక్నోజియాన్-17 పెస్ట్‌కు ఆల్కెమీ థీంను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిట్‌లోని సంగీత, నృత్య, నాటక క్లబ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులు డీజే షో మధ్య థీంను ఆవిష్కరించారు. అక్టోబర్ 27, 28, 29 తేదీలలో టెక్నోజియాన్ ఫెస్ట్ జరగనుంది. ఈ కార్యక్రమంలో నిట్ సంచాలకులు జీఆర్‌సీ రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మారెడ్డి, టెక్నోజియాన్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జి ఆచార్య బంగారుబాబు, స్టూడెంట్ కోఆర్డినేటర్ పియూష్ తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం మార్కెట్ ధరలు

వరంగల్ మార్కెట్: వరంగల్ మార్కెట్లో మంగళవారం వివిధ సరకులకు లభించిన గరిష్ఠ, కనిష్ఠ ధరలు(క్వింటాల్‌కు) రూపాయల్లో ఇలా ఉన్నాయి. ధాన్యం ఆర్ఎన్ఆర్: 1800-1800, మక్కలు: 1521-1412, జనుములు: 3012-3012, పల్లికాయ: 4150-2700, కొత్త కందులు: 4242-3002, పెసర్లు: 4825-2500, ఆముదాలు: 2551-2551, అలుచందలు నల్లవి: 5200-5200, శనిగలు: 6112-5912, పత్తి: 5200-4800, పసుపు కాడి: 7280-6280, గోల: 6880-6380, మిర్చి తేజ: 5300-2000, వండర్‌హాట్: 2500-1200, తాలు: 1100-500

కేసముద్రం, న్యూస్‌టుడే: మార్కెట్‌లో మంగళవారం వివిధ సరకులకు లభించిన గరిష్ఠ, కనిష్ఠ ధరలు(క్వింటాల్‌కు) రూపాయల్లో ఇలా ఉన్నాయి.. సాంబమసూరి(పా) 2421 - 1621, వెయ్యిపది 1381 -1351, మొక్కజొన్నలు 1465, 1199, పెసర్లు 4451, 3200, కందులు 4111- 4000, పత్తి 5123- 4061, పసుపు(కా) 7290- 4500, పసుపు(గో) 7277- 5200.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం అంతర్‌రాష్ట్ర వంతెన మహారాష్ట్ర వైపు చింతలపల్లి శివారు 363 నం. జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనగా జయశంకర్ జిల్లా పలిమెల మండలం అప్పాజీపేటకు చెందిన జాడి వెంకటేష్ (43) మృతి చెందారు. సిరోంచ పోలీసుల కథనం మేరకు... మంగళవారం తెల్లవారుజామున కాళేశ్వరం నుంచి అంతర్ రాష్ట్ర వంతెనపై నడుచుకుంటూ తన అత్తగారి గ్రామమైన సిరొంచకు వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అతని తల నుజ్జునుజ్జయింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరొంచ వైద్యశాలకు తరలించి, బంధువులకు అప్పగించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సూపే తెలిపారు.

బైకుల దొంగతనం కేసులో ముగ్గురికి జైలు

హుజూరాబాద్ పట్టణం: కమలాపూర్ మండలం కమలాపూర్, గూడూరు గ్రామాలలో ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికీ నెల రోజుల పాటు జైలు శిక్ష, రూ. 500ల చొప్పున జరిమానా విధిస్తూ మున్సిఫ్ మేజిస్ట్రేట్ జి.రాధిక మంగళవారం తీర్పు చెప్పారు. నిందితులు పి.రవివర్మ(21), ఎం.డి.ముజాహిద్(20), పృథ్వీ(20) ముగురు భూపాల్‌పల్లి- ఆచార్య జయశంకర్ జిల్లా ములుగుకు చెందినవారని తెలిపారు. కాగా అప్పట్లో కమలాపూర్ ఎస్ఐ గణేశ్ ఛార్జిషీట్ దాఖలు చేయగా పీపీ లక్ష్మీనారాయణ కేసును వాదించారు.

యువతరాన్ని కోల్పోతున్నాం!

రహదారి ప్రమాదాల్లో ఎక్కువ మృతులు వీరే

స్థూల జాతీయోత్పత్తి పై ప్రభావం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇదీ పరిస్థితి



ఒక వ్యక్తి మరణిస్తే.. ఆ ప్రభావం ఆ కుటుంబంపైనే కాదు. దేశంపైనా అనేక రకాలుగా ఉంటుంది. ప్రధానంగా దేశానికి సంపద సృష్టికర్తలుగా ఉండే యువత అర్ధాంతరంగా తనువు చాలిస్తుండటం దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుందని, స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) తగ్గడానికి ఇది ఒక కారణమవుతుందని ఆర్థిక నిపుణులు చెప్పే మాటలు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరుగుతున్న రహదారి ప్రమాదాల్లో అత్యధిక మృతులు చదువుకునేవారు, సంపాదనపరులైన యువత ఉంటుండటం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో చోటు చేసుకుంటున్న రహదారి ప్రమాదాలను కేంద్ర హోంశాఖ ఇటీవల సమీక్షించింది. రహదారి ప్రమాద మరణాలను తక్కువగా అంచనా వేయొద్దని, వీటిని తేలిగ్గా తీసుకోవద్దని సుతిమెత్తగా హెచ్చరించింది. ప్రమాదాల నివారణకు మహబూబాబాద్, వరంగల్ రూరల్, జనగామ, వరంగల్ అర్బన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రభుత్వ యంత్రాంగం పకడ్బందీ చర్యలు గైకొనాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

–న్యూస్‌టుడే, డోర్నకల్

ఉమ్మడి జిల్లా లెక్క ఇదీ..

☛ వరంగల్ కమిషనరేట్ పరిధిలో 2016లో జరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య 808. వీరిలో మృత్యువాత పడింది 266. వీరిలో యువత 159. గాయపడ్డ వారి సంఖ్య 896. వీరిలో యువత 537.

☛ మహబూబాబాద్ జిల్లా ఏర్పడ్డాక జరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య 238. వీరిలో మృత్యువాత పడింది 117. యువత 20

☛ మహబూబాబాద్ జిల్లాలో జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఆగస్టు 20 నాటికి ఆత్మహత్య చేసుకున్న వారి సంఖ్య 241. వీరిలో యువత 57.

కేంద్ర హోంశాఖ గణాంకాలివీ

దేశ వ్యాప్తంగా ప్రతి గంటకు జరుగుతున్న ప్రమాదాలు:	● రోడ్డు ప్రమాదాల్లో గంటకు మృతి చెందుతున్న వారు:	● ఇందులో గాయాలపాలవుతున్న వారి సగటు:
54	17	54

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్న రహదారి ప్రమాదాల్లో సంభవించిన మరణాల్లో 25- 35 ఏళ్ల వయసులోపు యువతే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఎంత లేదన్నా మరో 30 నుంచి 40 ఏళ్లు బతికే అవకాశం ఉన్న వీరిని మృత్యువు రహదారి ప్రమాదాల రూపంలో కబళిస్తుండటంతో ఆ మేరకు వారి సంపాదనను దేశం కోల్పోతున్నట్లే కదా. మరో పక్క రహదారి మరణాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో 70 శాతం మంది అల్పాదాయ వర్గాలకు చెందిన వారే ఉంటున్నారు. గాయపడి వైకల్యం పొందిన వారూ ఎక్కువగా ఉంటుండటంతో సామాజిక- ఆర్థిక స్థితిగతులపైనా ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

నష్టం అంచనా మాటలకందనిది

దేశంలో సగటు మనిషి జీవిత కాలం 64 ఏళ్లు. రహదారి ప్రమాదాల్లో 25 నుంచి 35 ఏళ్లలోపు వయస్కులు మృతి చెందుతుండటం వల్ల వారు ఇంకా 30- 40 ఏళ్లకు పైగా సంపాదన కోల్పోతున్నారు. వారు బతికుంటే ఈ వ్యవధిలో సంపాదించి ఖర్చు చేయటం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరేది. సంపాదనపరుడు అకాల మరణం పాలవటం వల్ల అతని వల్ల వచ్చే పలు రకాల పన్నులు, వ్యయం దేశం కోల్పోతోంది. మరణించిన వారి తలసరి ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుంటే కలిగే నష్టం రూ.కోట్లలో ఉంటుందని ఆర్థిక నిపుణుల విశ్లేషణ. ఐదు జిల్లాల్లో పరిస్థితి తీవ్రత ఇలా ఉంటే తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న రహదారి ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారి వల్ల కొన్ని రూ.వేల కోట్ల ఆదాయాన్ని ఈ దేశం కోల్పోతోందనేది నిర్వివాదాంశం. లారీ డ్రైవర్లు, ఇతరులు ప్రమాదాల్లో చనిపోయినప్పుడు లేబర్ కోర్టు ద్వారా కార్మికులకు బీమా అందిస్తారు. ఏ వ్యక్తి చనిపోయినా అతని మీద ఆధార పడిన వ్యక్తులు, చేసే వృత్తి, ఉద్యోగం ఆధారంగా ప్రమాద బీమాను లెక్కించి చెల్లిస్తారు. సైన్యంలో పని చేస్తూ సైనికుడు మరణిస్తే అతని కుటుంబానికి ఒకే మొత్తంగా చెల్లిస్తారు. జీడీపీ అనేది మొత్తం ఉత్పత్తి, మొత్తం వ్యయం ఆధారంగా నిర్ధారిస్తారు.

శిరస్త్రాణం తప్పనిసరి చేయాలి

రోడ్లపైకి వచ్చే వారిలో శిరస్త్రాణాలు ధరించే వారే బహు తక్కువ. కారణాలను విశ్లేషిస్తే.... అనేక మంది వీటిని ధరించడాన్ని భారంగా పరిగణిస్తున్నారు. తల తిరగదని, రహదారి సూచీ బోర్డులు సరిగ్గా కనిపించవనే సమస్యలను చెప్పి విస్మరిస్తున్నారు. పకడ్బందీగా అమలుచేసే యంత్రాంగం తక్కువే. ఐటీసీ వంటి కంపెనీలు తమ ఉద్యోగులకు శిరస్త్రాణం లేకుండా లోపలికి అనుమతించవు. ప్రతి సంస్థ ఈ విధానాన్ని అనుసరించాలి. టోల్‌గేట్ల వద్ద కూడా శిరస్త్రాణం ఉంటేనే వాహనాన్ని అనుమతించేలా నిబంధనలు సడలించాల్సిన అవసరం ఉంది. అమెరికా తదితర దేశాల్లో రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు మృతుల సంఖ్య తక్కువగా ఉండటానికి కారణం శిరస్త్రాణం ధరించడమే. అక్కడి పౌరులందరికి రహదారి నిబంధనలు తెలుసు. రహదారులు కూడా ప్రమాదాలకు తావు ఇవ్వని విధంగా ఉంటాయి. మన దేశంలో రహదారి నిర్మాణాల్లోనే అనేక లోపాలుంటున్నాయి. ఇవన్నీ మరణాలకు కారణాలని చెప్పుకోవడంలో తప్పేమీ లేదు.



సర్వేలేం చెబుతున్నాయంటే?

దిల్లీ కేంద్రంగా సాలోటర్ రోడ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద సంస్థ రహదారి ప్రమాదాలపై పలు కోణాల్లో సర్వే చేసింది. కారణాలు విశ్లేషిస్తూ 2016లో కేంద్రానికి ఒక నివేదిక సమర్పించింది. అందులోని ముఖ్యాంశాలు కొన్ని..

★ మన దేశంలో కేవలం ఒక్క జాతీయ రహదారుల పైనే ప్రమాదాలకు కారణమవుతున్న కూడళ్లు 16 వేల పైచిలుకు ఉన్నాయి.

★ వీటి వద్ద రోజుకు 100 మందికి తగ్గకుండా చనిపోతున్నారు.

★ రహదారి నియమాలు తెలియని వారు, మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది.

★ అధిక వేగం వల్ల చనిపోతున్న వారు 80 శాతం మంది.

★ దేశంలో రహదారి ప్రమాదాల నివారణకు స్పీడ్‌గన్‌లు ప్రవేశ పెట్టాలి. దీనికి రూ.1500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా.

★ డ్రైవింగ్ లైసెన్స్‌ల్లో 30 శాతం తప్పులు తడకలతో ఉంటున్నాయి.

★ డ్రైవింగ్ పరీక్షలకు హాజరు కాకుండానే అనేక మంది లైసెన్స్ పొందుతున్నారు.

★ వాహన చోదకులు కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. వీరు తనువు చాలించడం వల్ల పరోక్షంగా దేశ సంపదకు నష్టం వాటిల్లుతోంది

అక్కడ... ఇక్కడ

● విదేశాలల్లో వేగానికి మించి వెళుతుంటే మితిమీరిన వేగంతో వెళుతున్నావంటూ వాహన చోదకుడికి సంకేతం అందుతుంది. ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం మన దేశంలో లేదు.

● విదేశాలల్లో ఒకటికి రెండు సార్లు హెచ్చరించినా వేగం తగ్గకపోతే రహదారి పర్యవేక్షణ బృందాలు అదుపులోకి తీసుకుంటాయి. మన దేశంలో ఇలాంటి వ్యవస్థ నామమాత్రం.

● విదేశాల్లో మితిమీరిన వేగానికి జరిమానా పెద్ద మొత్తంలో విధిస్తారు. జైలు శిక్ష కూడా ఉంటుంది. మన దగ్గర మితిమీరిన వేగం నియంత్రించే వ్యవస్థ ఏదీ అందుబాటులో లేదు.

హెల్మెట్‌తోనే మనకు రక్షణ



పోలీసు అధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ ర్యాలీ

మహబూబాబాద్ క్రైం, న్యూస్‌టుడే: మన రక్షణ కోసం, మనల్ని నమ్ముకున్న కుటుంబం కోసం హెల్మెట్ ధరించాలని జిల్లా కలెక్టర్ ప్రీతిమీన అన్నారు. మంగళవారం స్థానిక రైల్వే సెంటర్‌లో ఎస్పీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. ముందుగా ఎన్టీఆర్ స్టేడియం నుంచి హెల్మెట్ ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రీతిమీన, ఎస్పీ కోటిరెడ్డి ప్రారంభించారు. సుమారు 500 మంది హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 75 రోడ్డు ప్రమాదాలు జరిగితే అందులో 40 మంది మృత్యువాత పడ్డారని వివరించారు అందరూ హెల్మెట్ ధరించేలా అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. డీటీవో భద్రునాయక్, జిల్లా ఆబ్కారీ అధికారి దశరథ్ , డీఈవో నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు రాజమహేంద్రనాయక్, రాజారత్నం మాట్లాడారు. ఈ సందర్భంగా బండ వెంకన్న కళాకారుల బృందం జబర్ధస్త్ రాజమౌళి, కె.వెంకన్న, సురేశ్, అనిల్‌కుమార్, భరత్, జిన్నా, అశ్విని, కవిత ఆటపాటలతో నృత్యాలతో ఆకట్టుకున్నారు.

నోటీసులు అందుకున్న డీసీసీబీ డైరెక్టర్లు

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గ డైరెక్టర్లు నోటీసులు అందుకున్నారు. ప్రభుత్వం ఈనెల 17న డీసీసీబీ పాలకవర్గాన్ని రద్దు చేస్తు ఉత్తర్వులు జారీ చేసింది. పాలకవర్గంలో మొత్తం 22 మంది డైరెక్టర్లున్నారు. గత నాలుగు రోజుల నుంచి రద్దు ఉత్తర్వులను అందించేందుకు ఇళ్లకు వెళ్లిన సందర్భంలో డైరెక్టర్లు అందుబాటులో లేరు. మంగళవారం ఒక్కరు మినహా 21 మంది డైరెక్టర్లకు నోటీసులు జారీచేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమాచారాన్ని రాష్ట్ర అధికారులకు కూడా అందించారు. డీసీసీబీకి సంబంధించి ఛైర్మన్‌తోపాటు డైరెక్టర్లు ఇప్పటికే కోర్టుకు వెళ్లారు. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పాలకవర్గానికి వారం రోజులు గడువు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో డైరెక్టర్లు నోటీసులు అందుకున్న వారం రోజుల వరకు ఎలాంటి నిర్ణయం తీసుకునేందుకు అవకాశంలేదు. ఆ తర్వాత ప్రభుత్వం ఉత్తర్వులు అమలులోకి వస్తాయి. డీసీసీబీ పాలకవర్గం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై కోర్టుకు వెళ్లినట్లు తెలిసింది. డీసీసీబీ విషయంలో కోర్టు ఎలాంటి తీర్పును చెప్పుతుందో వేచి చూడాల్సి ఉంది.

కేయూ పీజీ ప్రవేశాల గడువు 26

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ, శాతవాహన విశ్వవిద్యాలయాల్లోని పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో 2017-2018 విద్యాసంవత్సరానికిగాను ప్రథమ దఫా సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాల గడువును పొడిగించినట్లు కేయూ ప్రవేశాల సంచాలకు ఆచార్య వడ్డే రవీందర్, సంయుక్త సంచాలకులు డాక్టర్ వై. వెంకయ్య, డాక్టర్ టి.రాజకొమురయ్యలు మంగళవారం సాయంత్రం ప్రకటనలో తెలిపారు. మంగళవారంతో గడువు ముగిసిన నేపథ్యంలో విద్యార్థుల కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సీట్లు లభించిన విద్యార్థులు తమతమ కళాశాలల్లో ఈనెల 26వ తేదీలోగా ఫీజులను చెల్లించి ప్రవేశాలు పొందాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలను క్యాంపస్‌లోని ప్రవేశాల కార్యాలయంలో సంప్రదించవచ్చునని తెలిపారు.

ప్రత్యేక విభాగాల వారికి..

ప్రత్యేక విభాగాల విద్యార్థులు ఈనెల 26వ తేదీన కేయూ క్యాంపస్‌లోని ప్రవేశాల కార్యాలయంలో హాజరుకావాలని వారు తెలిపారు. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, వికలాంగుల, క్రీడా, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలు తమ అన్ని అసలు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. అదే రోజు ధ్రువీకరణపత్రాల పరిశీలనతోపాటు సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు.

కాజీపేట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

కాజీపేట న్యూస్‌టుడే: హైదరాబాదులో 2007వ సంవత్సరంలో పేలుళ్ల జరిగిన రోజును దృష్టిలో పెట్టుకొని మంగళవారం కాజీపేట రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టేషన్‌లో ప్రతి సంచిని, ప్రతి వ్యక్తిని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐలు వెంకటేష్, వీరన్న ఎస్సైలు దయాకర్, శ్రీనివాసురెడ్డి పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: ముకుంద- **జయ జానకి నాయక**, వెంకట్రామ- **నిన్నుకోరి** , శ్రీనివాస్- **నేనే రాజు నేనే మంత్రి**, లక్ష్మి- **లై**

మహబూబాబాద్

పనిచేయని బయోమెట్రిక్ యంత్రాలు

ఆశ్రమ పాఠశాలలకు గతేడాది ఐటీడీఏ ఆధ్వర్యంలో సరఫరా

కొత్తగూడ, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు ఐటీడీఏ ఆధ్వర్యంలో అందించిన బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయకపోవడంతో మూలన పడ్డాయి. యంత్రాలు సరఫరా జరిగినప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో కూడా యంత్రాలను వినియోగించిన దాఖలాలు లేవు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బయోమెట్రిక్ యంత్రాలు వినియోగించాలని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో గత విద్యా సంవత్సరం ప్రారంభ దశలోనే బయోమెట్రిక్ యంత్రాలను ఆయా పాఠశాలలకు మంజూరు చేశారు. కొన్ని పాఠశాలల్లో యంత్రాలను కొద్దిరోజుల పాటు వినియోగించారు. ఇందులో విద్యార్థుల, ఉపాధ్యాయుల పేర్లను నమోదు చేయడం ఇబ్బందులు ఎదురైనా వీటిని కొనసాగించే ప్రయత్నం చేశారు. కొన్ని పాఠశాలల్లో సిగ్నల్స్ రాక, సాంకేతిక లోపాలతో వీటిని ఉపయోగించడం లేదు. పాత ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో వీటిని వినియోగించకుండా మూలనపడేశారు. వీటి వినియోగంతో ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు చేరుకోవడంతో పాటు వసతి గృహాల నిర్వాహణ డిప్యూటీ వార్డెన్లకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయకపోవడంతో వీరంతా ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ఉన్నట్లుగా రికార్డుల ద్వారా పాఠశాలల నిర్వహణ కొనసాగిస్తున్నారు. బయోమెట్రిక్ యంత్రాలు వచ్చినా వీటి ఉపయోగం లేకపోవడంతో పాఠశాల సిబ్బంది నిర్వహణ ఇష్టారాజ్యంగా కొనసాగుతుందనే ఆరోపణలున్నాయి. ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పాఠశాలల నిర్వాహణలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి.



ఆశ్రమ పాఠశాలలో బయోమెట్రిక్ యంత్రంపై వేలిముద్ర వేస్తున్న విద్యార్థిని (పాతచిత్రం)

నాణ్యమైన యంత్రాలు అందిస్తేనే నిర్వహణ మెరుగు

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయడం లేదనే సాకుతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలున్నాయి. కొన్ని పాఠశాలలు బయోమెట్రిక్‌తో సంబంధం లేకుండా ఆదర్శంగా కొనసాగుతున్నాయి. పాఠశాలల నిర్వహణ గాడి తప్పడంతో కొత్తగూడ, గంగారం మండలాల్లోని మూడు ఆశ్రమ ఉన్నత పాఠశాలలు మూసివేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలంటే బయోమెట్రిక్ యంత్రాలు తప్పని సరిగా ఏర్పాటుచేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు. పాఠశాలల నిర్వహణలో హెచ్ఎంలు కఠినంగా వ్యవహరిస్తే ఉపాధ్యాయులతో సమస్యలు తలెత్తుతుండటంతో పలువురు హెచ్ఎంలు ఉపాధ్యాయుల సమయపాలనలో చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కొన్ని పాఠశాలల హెచ్ఎంలు పాఠశాలల నిర్వాహణపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటంతో ఉపాధ్యాయుల తీరు ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు మూసివేయకుండా ఉండేందుకు ఉన్నతస్థాయి అధికారులు నాణ్యమైన బయోమెట్రిక్ యంత్రాల వినియోగంపై కఠినంగా చర్యలు తీసుకోవాలి. యంత్రాలు పనిచేయడం లేదని సాకు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. దీంతోనే ఆశ్రమ పాఠశాలల నిర్వహణ గాడిలో పడే అవకాశముందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత రెండేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో బయోమెట్రిక్ యంత్రాల వినియోగంతో విద్యార్థుల హాజరుశాతం పెరగడమే గాకుండా ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నాణ్యమైన బయోమెట్రిక్ యంత్రాలను ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

ఆశ్రమ పాఠశాలల వివరాలు

మండలం	పాఠశాలలు
కొత్తగూడ	02
గంగారం	01
గూడూరు	04



ఆశ్రమ పాఠశాలకు అందజేసిన బయోమెట్రిక్ యంత్రం

నూతన యంత్రాల కోసం ప్రతిపాదించాం

నారాయణస్వామి, డీటీడీవో మహబూబాబాద్

గతంలో మంజూరు చేసిన బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయడం లేదు. నూతన బయోమెట్రిక్ యంత్రాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నూతన బయోమెట్రిక్ యంత్రాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం. పాఠశాలల్లో బయోమెట్రిక్ యంత్రాలు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం..

పారిశుద్ధ్య నిర్వహణపై వాడీవేడి చర్చ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో మంగళవారం ఛైర్‌పర్సన్ భూక్యా ఉమ అధ్యక్షతన నిర్వహించిన పురపాలక సర్వసభ్య సమావేశంలో అధికారులు, సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. పూర్తి స్థాయి కమిషనర్ లేకపోవడంతో పట్టణంలో పరిశుభ్రత కొరవడిందని ఇన్‌ఛార్జి కమిషనర్ దీనిపై దృష్టి సారించడం లేదని సీపీఐ వార్డు సభ్యుడు రామ్మూర్తి సభలో ప్రస్తావించారు. సిబ్బంది కొరతతో పాటు బహిరంగ మల విసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయిలో సమయాన్ని కేటాయించడంతో పారిశుద్ధ్య సమస్య నెలకొందని ఇన్‌చార్జి కమిషనర్ భాస్కరరావు అన్నారు. దీంతో కొద్దిసేపు అధికారులు, సభ్యులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. పారిశుద్ధ్య సమస్య పరిష్కారంలో అధికారులతో పాటు అందరి బాధ్యత ఉందని అధికారులు పేర్కొన్నారు. వివిధ పార్టీలకు చెందిన సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రతి వార్డులో రూ.50 వేలు కేటాయించాలని సూచించారు. ఇప్పటికే పనులు పూర్తి చేసిన వార్డులు కాకుండా మిగిలిన వార్డుల్లో ప్రత్యేక సిబ్బందితో పనులు చేపట్టాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాలతో పాటు శివారు కాలనీల్లో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపు ఇతర అంశాలకు సంబంధించి 76 అంశాల అజెండాపై సమావేశంలో చర్చించారు. మూడు అంశాలకు తప్పించి మిగిలిన 73 అంశాలకు పాలకవర్గం ఆమోదం తెలిపినట్లు సమాచారం. పట్టణంలోని డంపింగ్ యార్డు నిర్మాణంతో పాటు మరో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనుల టెండర్లను రద్దు చేసి మరో విడత టెండర్లు పిలవాలని సభ్యులు నిర్ణయించినట్లు తెలిసింది. మధ్యాహ్నం ప్రారంభమైన సమావేశం రాత్రి ఎనిమిది గంటల దాకా కొనసాగింది. సమావేశంలో వైస్‌ఛైర్మన్ సూర్నపు సోమయ్య, సీపీఐ ఫ్లోర్ లీడర్ బి.అజయసారథి, తెరాస ఫ్లోర్ లీడర్ ఎం.వెంకన్న, కోఆప్షన్ సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్యులు లేక ఇబ్బందులు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో ఆసుపత్రి సేవల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీవైఎల్ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు ఇరుగు అనిల్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. మంగళవారం ఇద్దరు వైద్యులు విధులకు హాజరు కాకపోవడంతో వైద్య పరీక్షల కోసం వచ్చిన పలువురు నిరాశతో ఇళ్లకు వెళుతున్నారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై పీహెచ్‌సీ హెచ్‌ఈవో వెంకటేశ్వర్లును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇద్దరు వైద్యులు సెలవుల్లో ఉన్నారని, సిబ్బంది మీజిల్స్, రూబెల్లా టీకాలు వేయడానికి వెళ్లారని వివరించారు.

28న ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా

గంగారం, న్యూస్‌టుడే: గంగారం స్థానిక మండల కేంద్రంలో మంగళవారం ఆదివాసీ ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ పరిధిలో పనిచేసే ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో జూనియర్, డిగ్రీ, డీఎడ్ కళాశాలల్లో అధ్యాపక పోస్టులు, ఎంఈవో, డిప్యూటీ డీఈవో పోస్టులను స్థానిక గిరిజన ఉపాధ్యాయులకే కల్పించే విధంగా జీవో నెంబర్ 3కు అనుబంధంగా ప్రత్యేక జీవోను విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 28న అన్ని ఐటీడీఏ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వట్టం వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి క్రీడాపోటీలు

గూడూరు, న్యూస్‌టుడే: ఈనెల 30 నుంచి స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ కార్యదర్శి దేవ్లా ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 14, 17 సంవత్సరాల విద్యార్థిని, విద్యార్థులు పోటీలో పాల్గొనాలన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు సెప్టెంబర్ 7, 8 తేదీల్లో జోనల్‌స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆపదలో అండగా నిలిచిన గుమస్తాలు

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం మండల బేరువాడ గ్రామానికి చెందిన కొండబోయిన శ్రీనివాస్ కేసముద్రం మార్కెట్‌లో గుమస్తాగా పని చేస్తున్నాడు. ఆయన కుమార్తె ప్రియాంక మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న తోటి గుమస్తాలు మంగళవారం రూ.15,000 ఆర్థిక సహాయం అందించారు. సహాయం అందించిన వారిలో ముత్యాల శివుడు, తెరాస రాష్ట్ర కార్యదర్శి భరత్‌కుమార్‌రెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం(వి) గ్రామంలోని చెరువు నుంచి కొంత మంది అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు యోగీశ్వర్‌రావు మాట్లాడుతూ ఎరువులో మట్టిని తరలించేందుకు రెవెన్యూ, ఐబీ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. అక్రమంగా మట్టి తరలింపుపై విచారణ చేసి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

భాజపా పట్టణ కార్యదర్శిగా పృథ్వీరాజ్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: భారతీయ జనతాపార్టీ (భాజపా) మహబూబాబాద్ పట్టణ కార్యదర్శిగా పట్టణానికి చెందిన జక్కుల పృథ్వీరాజ్‌ను నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు మోసంగి మురళి తెలిపారు. పట్టణంలో పార్టీ బలోపేతానికి ఆయనకు పార్టీ బాధ్యతలను అప్పగించినట్లు పేర్కొన్నారు.

భూ సర్వేను వేగవంతం చేయాలి

దంతాలపల్లి, న్యూస్‌టుడే: భూసర్వేను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ పి.సురేష్‌బాబు కోరారు. స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగాపేట, కుమ్మరికుంట్ల గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తయినట్లు తెలిపారు. బొడ్లాడ, వేములపల్లి గ్రామాల్లో చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలన్నారు. పారదర్శకంగా సర్వేను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, సీనియర్ అసిస్టెంట్ రాజేందర్, వివిధ గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

చరవాణి ద్వారా సమాచారమిస్తే మొక్కలు అందజేస్తాం

నెల్లికుదురు, న్యూస్‌టుడే: చరవాణి ద్వారా తమకు సమాచారం ఇస్తే పండ్ల మొక్కలు అందజేస్తామని మహబూబాబాద్ జీవవైవిధ్య యజమాన్య కమిటీ కోఆర్డినేటర్ దైద వెంకన్న తెలిపారు. మండలంలోని వావిలాల, గ్రామ శివారులోని మంగ్యా తండాల్లోని పలువురికి సుమారు 300 పండ్ల మొక్కలు మంగళవారం పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రణాళికతో ముందుకు పోతున్నామని, మొక్కలు నాటి వాటిని సంరక్షించే వారికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సారయ్య, సంతోష్, కొమురమ్మ, ఐలమ్మ, అనిత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్

24న బస్‌పాస్ మేళా

గూడూరు, న్యూస్‌టుడే: ఈనెల 24న స్థానిక అంగడి స్థలంలో వికలాంగులకు బస్‌పాస్‌మేళా ఏర్పాటుచేసినట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు మోటపోతుల వెంకటేశ్వర్లు, రుద్ర తిరుపతి సంయుక్త ప్రకటనలో తెలిపారు. నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సహకారంతో ప్రతి ఏడాది వికలాంగులకు బస్‌పాస్ మేళా ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటికి కటకట..!



అంబేడ్కర్ కూడలి నుంచి నీరు తెస్తున్న ఐలమ్మ

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బోరు బావి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల విద్యావనరుల కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలకు తాగు నీటి సరఫరా జరుగుతోంది. ఇదే బోరు బావి నుంచి గ్రామంలోని పలు వీధులకు తాగునీటి సరఫరా అందించే నల్లాల బావిలోకి, అక్కడ నుంచి ఓహెచ్‌స్సార్ ట్యాంకునకు ఎక్కిస్తారు. ట్యాంకు ద్వారా పలు వీధులకు నీటి సరఫరా జరుగుతోంది. కొద్ది రోజుల క్రితం బోరుబావి మరమ్మతులకు నోచుకోలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు వినియోగం, నిర్వహణ బాధ్యతలు గ్రామ పంచాయతీ చూస్తున్నప్పటికి మరమ్మతుల బారిన పడటంతో పైపులు తీసి, బయటవేశారు. దీంతో కొద్ది రోజులుగా విధులు నిర్వహిస్తున్న పాఠశాల సిబ్బంది దూరప్రాంతం నుంచి నీరు మోసుకొని తెస్తూ అవస్థలు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాల సిబ్బంది, ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలోని సహాయకురాలు బస్టాండ్, అంబేడ్కర్ కూడలి నుంచి బిందెల్లో నీళ్లు తీసుకురావడంతో తాగునీటికి వినియోగిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించి తాగునీరు అందించాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పార్థసారధిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా మరమ్మతులు, పైపులు, మోటారు బయటకు తీసిన విషయాన్ని గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారి నుంచి అనుమతులు పొంది రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బోరుబావి మరమ్మతులకు నోచుకోని దృశ్యం



బస్టాండ్‌లోని ప్రైవేటు వ్యక్తి ఇంటి నుంచి నీరు తెస్తున్న మంజుల

పింఛన్లు మంజూరు చేయాలని వినతి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: సర్పంచి, ఎంపీటీసీల పదవీ బాధ్యతలు నిర్వహించి పదవీ కాలం ముగిసిన అనంతరం మాజీ ప్రజాప్రతినిధులకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం తెలంగాణ మాజీ ప్రజాప్రతినిధుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో పదవీ కాలం ముగిసిన తర్వాత మాజీలకు గౌరవ వేతనం చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాజీ ప్రజాప్రతినిధులకు ఫించన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ విజయకుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆర్టీసీ కార్మికుల నిరాహార దీక్ష

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, యూనియన్ డిపో గౌరవ అధ్యక్షుడు బి.అజయసారథి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

మానుకోటలోనే ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనే గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని యువజన కాంగ్రెస్ నాయకులు వంశీకుమార్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశల వారీగా ఉద్యమాలు చేసి విశ్వవిద్యాలయాన్ని సాధించుకునేంత వరకు పోరాడతామన్నారు.

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయకుండా ములుగు ప్రాంతానికి తరలించుకుపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 24న బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎంపీ సీతారాంనాయక్ దిష్టిబొమ్మతో నిర్వహించనున్న శవయాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సంపత్ కోరారు. అత్యధికంగా గిరిజనులు ఉన్న మహబూబాబాద్‌లోనే విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు తరలించేందుకు యత్నిస్తుందన్నారు.

సీపీఐ కౌన్సిలర్ల నిరసన

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పట్టణంలో పారిశుద్ధ్యం లోపించిందని నిరసిస్తూ సీపీఐ కౌన్సిలర్లు దోమ తెరలు కప్పుకొని మంగళవారం పురపాలక కార్యాలయం ఎదుట చీపుర్లతో వీధులను శుభ్రం చేస్తూ నిరసన తెలిపారు. కార్యాలయంలో సాధారణ సమావేశానికి హాజరయ్యే ముందు వార్డు సభ్యులు వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ పురపాలక సంఘం ఫ్లోర్‌లీడర్ బి.అజయసారధి మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బందిని 116 నుంచి 200 దాకా పెంచాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణలో పురపాలక అధికారులు, అధికార పక్షం విఫలమైందని ఆరోపించారు. వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశముందని ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదని బి.అజయసారధి ఆరోపించారు. అలాగే అనేక సమస్యలున్నా ఛైర్‌పర్సన్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు.



చీపుర్లతో ఊడుస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ కౌన్సిలర్లు

జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంద శశికుమార్ కోరారు. మంగళవారం కళాశాలను సందర్శించి అక్కడ పలు సమస్యలను గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో రామకృష్ణ, ఉషా, ప్రవీణ్, మురళి పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలని ర్యాలీ



పోలీసుల ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరులో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలపై ప్రయాణం చేయాలని మంగళవారం ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. పోలీసుస్టేషన్ నుంచి ఎంపీడీవో కార్యాలయం, బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం మీదుగా వాహన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ రమేశ్ మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. హెల్మెట్‌తో ప్రమాదాలనుంచి రక్షణ ఉంటుందన్నారు.

అధ్వానం.. ఏజెన్సీ గ్రామాలు



జంగాలపల్లిలో..



ట్యాంకు వద్ద మురుగునీటితో ఇలా..

జంగాలపల్లి (గంగారం), న్యూస్‌టుడే: ఏజెన్సీ గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఒకవైపు ఉన్నతాధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పట్టించుకునే వారే లేరు. గంగారం మండలం మారుమూల గ్రామాలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారడంతో గూడెం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో రోడ్లపై మురుగు నీరు చేరి గ్రామస్థులు రోడ్లపై నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరంతా ఇళ్లలోని వాకిళ్లలో చేరడంతో దుర్గంధమయంగా మారాయి. గ్రామాల్లో సీజనల్ వ్యాధులకు గురవుతూ ఏజెన్సీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పారుశుద్ధ్య లోపం కారణంగా వివిధ రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. గ్రామాల్లోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తచెదారంతో రోడ్లన్నీ బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే దోమలు రోజురోజుకు పెరగడంతో అనేక మంది ఏజెన్సీ వాసులు రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో పలు చోట్ల తాగునీరు కలుషితమవడంతో వివిధ రకాల వ్యాధులతో సతమతమవుతున్నారు.



కాలువ లేక బురదమయంగా మారిన దృశ్యం



జంగాలపల్లి తండాలో ఇళ్ల మధ్యలో...

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడలోని బాలికల డిపార్ట్‌మెంట్ హాస్టల్(డీఏహెచ్) వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కార్యకర్తలు మంగళవారం ఏటీడీవో మోహన్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో బాలికలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. విధులపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో బాలికలకు రక్షణ లేకుండా పోతోందని ఆరోపించారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

CLASSIFIEDS

YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, PAINTS, HOMEO ... BABY CARE CENTERS ... CEMENT, EYE CARE, COOKING ... GS ... NESS ... EP ... OLOGY ... HOME DELIVERY ... & FOUND
GIFTS, COURIERS, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

AUTOMOTIVE

VEHICLES FOR SALE

Vehicle for Sale. 2 Ape City TS03UB 5805, TS03UA 9529, APE AR TS24T 0147, Auction on 23-08-2017. Cont: Indusind Bank Ltd. Cell: 7337340639.

School Bus for Sale Bus Registration No. AP 12V 2675, 25 Seater Bus Sale. Amount 75,000 Rs. 9849790215, 7013219466.

BUSINESS SERVICES

పుట్టగొడుగులు పెంపకం ద్వారా మీ ఇంటి వద్దనే అధిక ఆదాయం సంపాదించండి. ఒక్కరోజు శిక్షణ మీ ఇంటి వద్దకు వచ్చి మేమే కొంటాము. ప్రభు మష్రూమ్స్ ప్రోడక్ట్స్ ✆ 93923 71493

BUSINESS OFFER

పేపర్ ప్లేట్స్ తయారుచేయు హైడ్రాలిక్ & ఫుల్లీ ఆటోమెటిక్ మెషిన్లు. నెలకు మంచి ఆదాయం, ముడిసరుకు ఇచ్చి తయారైనవి కొంటాం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. బ్లూ ఇంపెక్స్, ✆ 076590 77712.

GST సువిధ సెంటర్స్ ఫ్రాంఛైజీ కోసం జిల్లాలోని అన్ని మండలాల వారీగా INTERNET & MEESEVA మరియు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. వివరాలకు సంప్ర: 97017 51551, 91770 21347.

BEAUTY CARE

BEAUTY PARLOUR

Sri Miracle Herbal Ladies Beauti Parlour, గాంధీ సెంటర్, పాలకుర్తి రోడ్, స్టేషన్‌ఘన్‌పూర్, Cont: 9440913325, 8897804375.

COMPUTER EDUCATION

Any Govt. Certification Course Just 500/- & Get free LTM Card (ఖాళీ సమయంలో డబ్బులు సంపాదించడం కొరకు) PGDCA, DCA, DTP, 'C', Photoshop @ Srisai Mindsoft, HNK -9866055003

EDUCATION

Inter/ Degree one Sitting Direct 10th B.A, B.Com, M.A, M.Com, B.Tech, M.Tech, MBA, MCA, B.Sc, M.Sc, BBA, BCA, B.Ed, M.Ed, PHD. Contact: 9966028640.

కేవలము 2 1/2 నెలల్లోనే ఇంటర్/ డిగ్రీ, బి.టెక్, ఎమ్.టెక్, MBA, M.Phil, P.hD పూర్తి. Eligible for Govt & Private Jobs. C/o. DSR కాలేజీ. Hnk, Cell: 9346634381.

శ్రీ సాయితేజ ITI జనగామలో ఎలక్ట్రీషియన్ & డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడులలో సీట్లు కలవు. అడ్మిషన్లకు చివరి తేది: 28-8-17. వెంటనే సర్టిఫికేట్స్‌తో సంప్రదించండి.

శ్రీ సాయి ఆదిత్య ITI జఫర్‌గఢ్ రోడ్ (స్టే) ఘన్‌పూర్‌లో ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో సీట్లు కలవు. అడ్మిషన్లకు చివరి తేది: 28-8-17. వెంటనే సర్టిఫికేట్స్‌తో సంప్రదించండి.

REAL ESTATE

HOUSE FOR SALE

శామీర్‌పేట దగ్గర విల్లా ప్లాట్స్ & HMDA గేటెడ్ కమ్యూనిటీలో 2 BHK ఇండిపెండెంట్ ఇండ్ల ధర రూ॥ 24 లక్షలు. 80% బ్యాంక్ లోన్‌తో సేల్‌కు కలవు. స్కైవే, జీనోమ్ వ్యాలీ, Hyd. ✆ 94947 29074.

PLOT FOR SALE

యాదగిరిగుట్ట నుండి 3Km దూరంలో పెద్ద కందుకూరులో తక్కువ ధరలో ప్లాట్లు అమ్మబడును. మంచి వాస్తు & ప్లాట్లు సైజులు కలవు. బ్యాంకులోను కలదు. 040-24126888/9121797919

Commercial Plot for Sale at Hunter Road, Near J.S.M. School, 235 Yards for Rs. 79.5 Lakhs. Serious Buyers Only. (No Brokers) Plz. Cont: 9849534693, 9866885525.

SHOP FOR SALE

HNK Prime locationలో మంచి రన్నింగ్ కండీషన్‌లో గల మెడికల్ షాపు అమ్మబడును. ఆసక్తి గలవారు 8978909631.

WANTED

ఇంటి ప్లాట్ కావలెను. 250 నుండి 300 గ॥ HNK, KLN రెడ్డి కాలనీ, SBH కాలనీ, టీచర్స్ కాలనీ, ఫేస్-I &2, కనకదుర్గ కాలనీ, నక్కలగుట్ట, ఎక్సైజ్ కాలనీలో కావలెను. సంప్ర॥ 9989508075.

SITUATIONS VACANT

Service Managers for SAPTA-PADII matrimony.com, HNK Branch. Qly: DG/ PG, exp above 3 yrs Any, Sal; 10,000-15000/-, Cont: 8367676156.

పరకాలలోని ఆసుపత్రిలో పనికి వంటకు ఏ బాధరబంది లేని ఆడమనిషి లేదా భార్యభర్తలు కావలెను. వసతి కల్పించబడును. సంప్ర॥ 9866974345, 9703434345.

జాబ్ ఆఫర్: Shara గ్రూప్ కంపనీకి క్రొత్త జిల్లాలో పర్మినెంట్ ఉద్యోగాలు. నో ఫీజు, ఫ్రీ రూం. అ: 10th ఆపైన, వ: 18 to 26 సం॥లోపు స్త్రీ/పు. సంప్ర: Wrgl. Cell: 79811 66439, 70363 08141.

WGL, HNK లో లేడీ రిసెప్షనిస్ట్, టెలికాలింగ్, సేల్స్ మార్కెటింగ్ Male/F, Q: 10th/ ఇంటర్/ MBA (HR), బిటెక్. @ 9441137413, 7989878461.

Wanted DTP Operator, Primary, Telugu & Hindi, Middle School, Chemistry, Mathematics, Floor incharge (Lady). C: 9392522837/ 9392522840/ 8686236623.

Wanted Experience Staff Nurse For Hospital. Cell No: 7680071974

TS ఇండస్ట్రియల్‌లో జిల్లాలవారీగా ఉద్యోగాలు బిటెక్ (ME, EEE) డిప్లొమా ఐటి ఆల్ 10th, ఇంటర్, డిగ్రీ. వ: 30 లోపు, జీ: 10 to 15 వేలు, రూ+ భో. సౌకర్యం. అర్హత కల్గినవారు మీ పూర్తి అడ్రస్‌ను SMS మాత్రమే చేయగలరు. ✆ 98483 48684.

Hyd లో గల ప్రముఖ లిమిటెడ్ కంపెనీలకు హెల్పర్స్, ప్యాకర్స్, సూ॥వైజర్స్, B.Sc కెమిస్ట్రీ, ITI ఆల్‌ట్రేడ్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 10,000/- to 16,000/- (రూం+మీల్స్ సౌకర్యం) ✆ 9705549598/ 9553632447

హన్మకొండలో గల ప్రముఖ ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపులో వర్క్ చేయుటకు Photoshop డిజైనర్ కావలెను. అనుభవంగల వారికి జీతం: 10,000/- లు. సంప్ర॥ 9177455451, 8522023535.

హాస్టల్లో పనిచేయుటకు పనిమనుషులు (నలుగురు ఆయాలు, చాకలి) వారు కావలెను. భోజనం, వసతి ఉచితం. లిబర్టీ స్కూల్, జాకారం, ములుగు. సంప్ర॥ 9603009916, 9912839747.

శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్ నందు మార్కెటింగ్ చేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. అ: డిగ్రీ, జీ: 10-15 వేలు. సంప్ర॥ 9959491774, 9392389113.

హర్షిణి అసోసియేట్స్, Wgl. నందు పనిచేయుటకు టెలీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్స్ (F) & అడ్వైజర్స్ (M&F) కావలెను. Sal + ఇన్సెంటీవ్స్. Ph: 9959371331.

వరంగల్ చార్‌బౌళి నందు చక్రవర్తి క్లినిక్‌లో పనిచేయుటకు ఆయా & సిస్టర్స్ & మెడికల్ షాపు బాయ్స్ కావలెను. 9247340499, 9959210105.

బాలసముద్రం ఇంటిలో పనిచేయుటకు పనివారు కావలెను. భార్యాభర్తలకు వసతి. పిల్లలకు చదువు ఉచితం. జీతం: 5000 + 5000. Call: 8006061234, 9885552497.

US Based Co.లో 2 లేక 3 గం॥లు పనిచేస్తూ 10 వేల నుండి 30 వేలు సంపాదించే వ్యాపార అవకాశం. Govt EMP, సీనియర్ సిటిజన్స్, 30+ గ్రాడ్యుయేట్స్ ✆ 98481 27080.

MARKETING / SALES

J.S.R. గ్రూప్ సన్‌సిటీ యాదగిరిగుట్ట వరంగల్ హైవేలో రియల్ ఎస్టేట్ మార్కెటింగ్‌కు టీమ్‌లీడర్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం+ కమీషన్+ ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. 7799893899

FACULTY / TEACHERS

Wanted English Teacher to Teach upto X Class. Salary 16000, Liberty High School, Jakaram, Mulugu, 9603009916, 9912837515.

Lady Teacher for Pre- Primary Classes E/M Fluency in English Sri Saraswathi Shisu Mandir, Hanamkonda. Time: 11.30 A.M., Cell: 9989431142.

TOURS & TRAVELS

Singapore & Malaysia @ 49,999/- Dubai & Abudhabi @ 49,999/- Bangkok, Pattaya & Phuket @ 39,999/- Kakani Holidays P.Ltd. ✆ 97016 95555.

శ్రీలంక రామాయణ యాత్ర & శాంకరీదేవితో @ 33,999/- శోభన, ద్వారక, ఉజ్జయిని & ఓంకాళేశ్వరితో @ 14,999/- కాకాని హాలిడేస్ ప్రై॥ లిమిటెడ్. ✆ 91779 42424.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న స్పీకర్

తెదేపా జయశంకర్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు



ఎన్నిక వాయిదా వేయాలని మంత్రి పంపించిన లేఖను చూపిస్తున్న గండ్ర సత్యనారాయణరావు

జులైవాడ, న్యూస్‌టుడే: భూపాలపల్లి జయశంకర్ జిల్లాలో శాసన సభ స్పీకర్ మధుసూధనాచారి ఆయన కుమారులు అధికార పార్టీ అండతో ప్రజాస్వామ్య విలువలు మంట కలిపేలా వ్యవహరిస్తున్నారని తెదేపా భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు గండ్ర సత్యనారాయణరావు విమర్శించారు. మంగళవారం హన్మకొండ బాలసముద్రంలోని వరంగల్ అర్బన్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లి జిల్లా గణపురంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక షెడ్యూల్ ప్రకారం జరగాల్సి ఉండగా అధికార అండతో దాన్ని వాయిదా వేస్తూ గెలుపొందిన డైరెక్టర్లను ప్రలోభపెడుతున్నారన్నారు. ఈ సంఘం ఎన్నిక 5 ఏళ్లకోసారి జరపాల్సి ఉండగా రెండున్నరేళ్ల ఆలస్యంగా నిర్వహించారన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 10న నామినేషన్, 11న పరిశీలన, 14న ఉపసంహరణ, 21న ఎన్నిక, 22న అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక జరపాల్సి ఉంది. మొత్తం 9 మంది డైరెక్టర్లలో అయిదుగురు తెదేపా మద్దతుతో గెలిచారన్నారు. అధ్యక్ష ఎన్నిక జరగాల్సి ఉండగా అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ వాయదా వేయించాలని స్పీకర్ ఆయన కుమారులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గెలుపొందిన మద్దతుదారులకు డబ్బులు ఆశ చూపుతూ వారి కుటుంబానికి రెండు పడక గదులు ఇస్తామని, తమకు మద్దతు తెలపమంటూ ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నిక నిర్వహించాల్సిన అధికారులు అధికార పార్టీ నేతలకు వత్తాసుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికను వాయిదా వేయాలని సంబంధిత మంత్రితో లేఖను తెప్పించి స్పీకర్ ఎన్నికల అధికారి వేణుగోపాల్‌పై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన డైరెక్టర్లను పరిచయం చేశారు. వారితో స్పీకర్ ప్రలోభపెడుతున్న విషయాన్ని మీడియాకు చెప్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పుల్లూరి అశోక్‌కుమార్, జిల్లా నాయకులు చాడా రఘునాథరెడ్డి, మన్సూర్ హుస్సేన్, సాంబయ్య, మార్గం సారంగపాణి, రహీమ్, కుసుమ శ్యాం, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, అశోక్, రాజు, ఘనపురం మత్స్యశాఖ డైరెక్టర్లు కె.రవీందర్, రమేష్, శంకర్, మల్లయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ ప్రతినిధుల పర్యటన

ఎనిమిది నెలల్లో కంపెనీ ప్రారంభం



మడికొండ పారిశ్రామిక వాడలో పర్యటిస్తున్న కంపెనీ, సొసైటీ ప్రతినిధులు

మడికొండ, న్యూస్‌టుడే: కాజీపేట మండలం మడికొండ పారిశ్రామిక వాడలో పవర్‌లూమ్స్ యంత్రాలను ఏర్పాటు చేయడానికి గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌కు చెందిన అలీంద్రా మల్టీనేషనల్ కంపెనీ డైరెక్టర్ సురేశ్ మంగళవారం పర్యటించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మడికొండలో సాగుతున్న టెక్స్‌టైల్ పార్కులో ఇప్పటికే పది కోట్లతో రోడ్లు, విద్యుత్తు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేసి భవనాల నిర్మాణానికి సమాయత్తం చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యేతోపాటు రాష్ట్ర టెక్స్‌టైల్ కమిషనర్ బృందం గతంలో గుజరాత్ పర్యటన సందర్భంగా అక్కడి కంపెనీ అలీంద్రాను పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పవర్‌లూమ్స్ యంత్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేయడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని భావించి వారిని ఆహ్వానించినట్లు సొసైటీ అధ్యక్షుడు దర్గాస్వామి తెలిపారు. మడికొండ పారిశ్రామిక వాడలోని 60 ఎకరాల స్థలంలో 360పైగా పవర్‌లూమ్ యంత్రాలు ఏర్పాటు చేసి 5వేల నుంచి పదివేల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సూరత్‌కు చెందిన అలీంద్రా కంపెనీ డైరెక్టర్ సురేశ్ వచ్చి పార్కు స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. స్థానిక 34వ డివిజన్ కార్పొరేటర్ జోరిక రమేశ్, కాకతీయ టెక్స్‌టైల్ వీవర్స్ సొసైటీ కార్యదర్శి సోమయ్య, ఐలయ్య, వీరన్న, నగేశ్, తెరాస నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: బ్యాంకుల విలీనం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యూనైటెడ్ ఫోరం బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బ్యాంకులు బంద్ పాటించి ఉద్యోగులు నిరసన తెలిపారు. హన్మకొండ ఆంధ్రా బ్యాంకు జోనల్ కార్యాలయం ఎదుట ఆల్ బ్యాంక్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు ప్లకార్డులు చేతబూని నిరసన ప్రదర్శన చేపట్టి తమ డిమాండ్లను చాటారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ వ్యతిరేక నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని మహిళా ఉద్యోగులు నినదించారు. ఈ సందర్భంగా ఎస్బీఐ, ఆంధ్రా బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ సెక్రటరీ శంకర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. బ్యాంకుల విలీనాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా కేంద్రం మొండి వైఖరి అవలంబిస్తూ అమలు చేస్తుందని అన్నారు. బ్యాంకులను పూర్తిగా ప్రైవేటీకరించాలని కుట్ర చేస్తూ ఉద్యోగులపై పనిభారం పెంచుతూ మానసిక ఆందోళనకు గురి చేస్తుందని వారు ఆరోపించారు. ఖాళీలను భర్తీ చేయకుండా, నియామకాలను చేపట్టాలని అనే బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు కేంద్ర ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ప్రభుత్వ ధోరణి ఇలాగే కొనసాగితే దేశ వ్యాప్తంగా పని చేస్తున్న లక్షలాది మంది ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి నిరవధిక ఆందోళన చేపట్టడానికి సిద్ధమవుతారని వెల్లడించారు. కేంద్రం వెంటనే పునరాలోచించి ఉద్యోగ సంఘాల నాయకులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు గోపాల్‌రెడ్డి, సతీష్‌కుమార్, గంగాధర్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లంబర్లకు మెమోలు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఎంజీఎం ఆసుపత్రిలో పని చేస్తున్న నలుగురు ప్లంబర్‌లకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ మెమోలు ఇచ్చారు. నర్సింగ్ స్కూల్‌లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని సూచించినప్పటికీ నిర్లక్ష్యం వహించారన్న కారణంతో ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్లంబర్లు సుధాకర్, శ్రీను, రవి, సందీప్‌లకు మెమోలు ఇచ్చారు. నర్సింగ్ స్కూల్‌లో పనులు ఎందుకు పూర్తి చేయలేదో రాత పూర్వకంగా సమాధానమివ్వాలని సూపరింటెండెంట్ ఆదేశించారు.

స్టార్టర్లు తొలగిస్తేనే నిరంతర విద్యుత్తు..!

జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు	సబ్ స్టేషన్లు	రైతులు	వ్యవసాయ భూములు
73,394	59	1,39,617	1,41,109 హెక్టార్లు

మహబూబాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే

గతంలో వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు విద్యుత్తు సరఫరా చేసేవారు. ఐతే తరచూ అవాంతరాలు ఏర్పడటంతో రైతులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ఆటోమేటిక్ స్టార్టర్లను వ్యవసాయ బావులకు అమర్చారు. విద్యుత్తు వచ్చినపుడు మోటారు ఆన్ అయితే పొలాలకు నీరు పారేది. దీంతో ఇష్టానుసారంగా భూగర్భ జలాలు తోడేసేవారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి విద్యుత్తు శాఖకు భారీగా నష్టం వస్తోంది. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు ఇవ్వడంతో నిరంతరం పని చేసి చివరకు మోటార్లు కాలిపోయి అన్నదాతలకు నష్టం వాటిల్లుతోంది.. గమనంచిన విద్యుత్తు అధికారులు ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. రైతులను స్వచ్ఛందంగా తొలగించాలని లేకుంటే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆదేశించింది. విద్యుత్తు సరఫరా చేస్తున్న నేపథ్యంలో తదనుగుణంగా విద్యుత్తు ఉపకేంద్రాల సామర్థ్యం పెంపు, అవసరమైన చోట కొత్త ఉపకేంద్రాల నిర్మాణం, అదనపు నియంత్రికల ఏర్పాటుపై విద్యుత్తుశాఖ దృష్టి సారించింది. జిల్లాలోని 16 మండలాల పరిధిలో మొత్తం 73,394 వ్యవసాయం కనెక్షన్లు ఉన్నాయి.



కాలిపోయిన విద్యుత్తు నియంత్రికలు

ఒకే సారి లోడ్‌తో ఇబ్బంది..

ఆటోమేటిక్ స్టార్టర్లు బిగించిన మోటార్లన్నీ విద్యుత్తు సరఫరా వచ్చిన వెంటనే ఒకేసారి ఆన్ అవుతాయి. ప్రతి 3 అశ్వశక్తి సామర్థ్యం కలిగిన పంపుసెట్ తొలుత 8 యాంపియర్ల విద్యుత్తును తీసుకొని కొనసాగింపులో 4.5 యాంపియర్ల విద్యుత్తుతో నడుస్తాయి. విద్యుత్తు ఉపకేంద్రాల్లో బ్రేకర్‌ను ఆన్‌చేసిన తరువాత మోటార్లన్నీ ఒకేసారి ఆన్ కావడంతో 400 యాంపియర్ల దాకా విద్యుత్తు అవసరం. సాధారణంగా 200 యాంపియర్ల విద్యుత్తు సరఫరాతోనే బ్రేకర్లు ట్రిప్ కాకుండా ఉంటాయి. కాని మోటార్లన్నీ ఒకేసారి ఆన్ కావడంతో బ్రేకర్లు ట్రిప్ అయి తరచూ సరఫరా నిలిచిపోతుంది. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్లు, ఉపకేంద్రాల్లోని నియంత్రికలు కూడా చెడిపోతుండటంతో ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలని గతేడాది ఉన్నతాధికారులు అదేశించారు. విద్యుత్తు అధికారులు సిబ్బంది ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించే పని



ఆటోమేటిక్ స్టార్టర్ ఇదే

భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న రైతులు

చేపట్టినా రైతుల నుంచి వ్యతిరేకత ఎదురుకావడంతో మళ్లీ పట్టించుకోలేదు. దీనిపై రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

పొలాల వద్ద పడిగాపులు

ఇదివరకు విద్యుత్తు ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితులుండేవి. రైతులు రాత్రింబవళ్లు పొలాల వద్ద పడిగాపులు కాస్తూ విద్యుదాఘాతానికి గురై, పాముకాట్లతో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. గతంలో 7 గంటల త్రిఫేజ్ విద్యుత్తు సరఫరాను గతేడాది నుంచి ప్రభుత్వం 9 గంటలకు పెంచింది. జిల్లాలో అత్యధిక శాతం రైతులు వ్యవసాయ మోటార్ల ఆధారంగా పంటలు సాగు చేస్తుండటాన్ని దృష్టిలో ఉంచుకొని నిరంతరాయంగా సరఫరా చేయాలన్నారు. సర్కారు రాగానే బోరుమోటారు నడిచేలా.. సరఫరా ఆగిపోతే వెంటనే మోటారు నిలిచేలా స్టార్టర్ డబ్బాలో ఏర్పాటు చేసుకున్న ప్రివెంటర్ల కారణంగా ప్రస్తుతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పొలానికి నీరు అవసరమున్నా.. లేకున్నా మోటారు నిరంతరాయంగా నడుస్తోంది. దీంతో విలువైన సాగు నీరు వృథా అవుతోంది. అవసరం లేకున్నా నీటిని తోడేయడంతో భూగర్భజలాలు తగ్గిపోవడానికి ఆస్కారముంది. అంతేగాక బావుల్లో నీటిమట్టం తక్కువగా ఉన్న రైతుల సమస్య మరోలా ఉంది. నీటి నిల్వ లేకున్నా మోటార్లు నడవడంతో కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. మరమ్మతులకు రూ.3 వేలు, బావిలో నుంచి మోటారును పైకి తీసేందుకు మరమ్మతులు చేశాక మళ్లీ బిగించేందుకు రూ.వెయ్యి పైగా ఖర్చవుతోందని రైతులు పేర్కొంటున్నారు.

ఆటోమేటిక్ స్టాటర్లతో తీరని నష్టం

– భిక్షపతి, డీఈ, విద్యుత్తు శాఖ, మహబూబాబాద్

రైతులు ఆటోమేటిక్ స్టాటర్లు తొలగించుకోవాలి. లేకుంటే మోటారు నిరంతరంగా నడిచి కాలిపోతుంది. నియంత్రికలు, సబ్‌స్టేషన్‌పై విద్యుత్తు భారం పడి బ్రేకర్లు ట్రిప్ అవుతున్నాయి. అంతేగాక బావుల్లో నీటి పరిమాణాలు తగ్గిపోతాయి. ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలి.

విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలి

ఆర్డీవోకు మొరపెట్టుకున్న అన్నదాతలు

మరిపెడ, న్యూస్‌టుడే: 'మేం నమ్మకంతో భూములు ఇచ్చాం.. సాక్షాత్తు పాలనాధికారి, ప్రజా ప్రతినిధులు హామీ ఇస్తే న్యాయం జరుగుతుందని నమ్మాం.. మా నమ్మకాన్ని వమ్ము చేయొద్దు.. భూమిని నమ్ముకొని బతికే గిరిజనులం.. అమ్మా మాకు న్యాయం చేయండి. ఎకరాకు మీరు ఇస్తామంటున్న రూ. 17లక్షలు మా భూమి విక్రయించుకుంటే 17 గుంటల భూమికే వస్తుంది. మాకు న్యాయం జరగకుంటే మరణమే శరణ్యమ'ని మరిపెడ శివారు గిరి జన తండాలకు చెందిన ఎస్సారెస్పీ కాలువల నిర్వాసిత రైతులు ఆర్డీవో కృష్ణ వేణికి మొరపెట్టుకున్నారు. మంగళవారం మరిపెడ తహసీల్దార్ కార్యాల యంలో ప్రభుత్వం నిర్ణయించిన పరిహారం వివరాలు ఆర్డీవో రైతులకు తెలి యజేశారు. ఆవేదనకు గురైన వారు తమ భూములు బంగారమని, జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న తమ భూములు ఇటీవల కాలంలో వ్యవ సాయేతర అవసరాలకు మాత్రమే విక్రయించారన్నారు. ఒక్కో గుంట రూ. లక్ష పై చిలుకు పలుకుతోందని.. ప్రభుత్వం నిర్ణయించిన పరిహారానికి తాము ఒప్పుకోమని భీష్మించారు. శాసనసభ్యుడు రెడ్యానాయక్ స్వయంగా ఇచ్చిన హామీ మేరకు భూములు ఇచ్చామని తీరా ఇప్పుడు గిట్టుబాటు లేకుండా ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. తాము మరోమారు శాసనసభ్యు డిని కలుస్తామన్నారు. రైతుల ఆవేదనను విన్న ఆర్డీవో జిల్లా పాలనాధికా రితో ఫోన్‌లో మాట్లాడారు. విధి విధానాల ప్రకారం ధర నిర్ణయించారని, అంతకు మించి ఎక్కువ ఇచ్చే పరిస్థితి లేదని పాలనాధికారి చెప్పడంతో రైతులు అందుకు ఒప్పుకునేది లేదని తేల్చిచెప్పారు.



ఆర్డీవోకు మొర పెట్టుకుంటున్న రైతులు

తెదేపా నాయకుడిని పరామర్శించిన రేవూరి

కోనాపురం (కొత్తగూడ), న్యూస్‌టుడే: తెదేపా మాజీ మండలాధ్యక్షుడు కందిమల్ల మధూసూదన్‌రెడ్డిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోనాపురంలో పరామర్శించారు. మధుసూదన్‌రెడ్డి తల్లి బతుకమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో విషయాన్ని తెలుసుకున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి బతుకమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. రేవూరి వెంట స్థానిక మండల నేతలు సుంకరబోయిన మొగిలి, కొత్తగూడ సర్పంచి తిరుపతి, వెల్దండి వేణు, తదితరులు ఉన్నారు.

మార్కెట్ ఎదుట పడిగాపులు

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతులకు పడిగాపులు తప్పడం లేదు. ఈ నామ్ అమలు చేస్తున్న కారణంగా మంగళవారం ఉదయం 8 గంటలకే మార్కెట్ గేట్లు మూసి వేశారు. అనంతరం పది గంటల దాకా వచ్చిన రైతులు గేటు వద్ద పడిగాపులు తప్పలేదు. ఈ విషయమై మార్కెట్ ఛైర్‌పర్సన్ భీరవెల్లి ఉమారెడ్డి మాట్లాడుతూ రైతులను ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని సమయపాలన తెలియడం కోసమే గేట్లు మూసివేసినట్లు తెలిపారు. కేసముద్రం మార్కెట్‌లో ఈ-నామ్ అమలు చేస్తున్నందున సమయపాలన పాటించాల్సి వస్తుందని తెలిపారు. రైతులు ఉదయం 8 గంటల్లోపు సరకులు తీసుకొచ్చి మార్కెట్ పాలక మండలికి సహకరించాలని కోరారు.



మార్కెట్ ఎదుట నిలిచిన రైతుల వాహనాలు

విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కేసముద్రం, న్యూస్‌టుడే: విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బండోజు ఉపేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి చిట్మిళ్ల రఘు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా కర్ణకంటి నాగన్నను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొల్లోజు రామ్మోహనాచారి, వెలిశాల బ్రహ్మచారి, వలబోజు సోమయ్య, గద్దోజు నరేంద్రాచారి, గద్దోజు నరసింహాచారి, బెజ్జంకి బ్రహ్మచారి, పొడకంటి స్వామి, బొల్లోజు వెంకటాచారి, బొల్లోజు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖిలాఫత్ దివస్‌ను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: పాత పింఛన్ సాధన కోసం చేపట్టే ఖిలాఫత్ దివస్‌లో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి సామూహిక సెలవులో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పింఛన్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా వ్యవసాయ కార్యాలయం వద్ద గోడపత్రికలను ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు కోసం ప్రభుత్వ సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల ఖిలాఫత్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాజనరేందర్, శంకర్, అరుణ్‌కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 42 మందికి ఉద్యోగాలు

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని డీఆర్డీవో, ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, మార్కెటింగ్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 42 మందికి సెక్యూరిటీ ఉద్యోగం ఇప్పించినట్లు డీఆర్డీవో గణేశ్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసి కార్యక్రమంలో జిల్లాలో మొత్తం 95 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా 42 మందికి ఉద్యోగం వచ్చినట్లు తెలిపారు. ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జేడీఎం శ్రీలత, ప్రసన్న, ఉమా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

మహబూబాబాద్ క్రైం, న్యూస్‌టుడే: దాడి చేసి, బంగారు నగలు ఎత్తుకెళ్లిన కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్‌నాయక్ మంగళవారం తీర్పునిచ్చారు. కొడకండ్లకు చెందిన రాములమ్మ అనే మహిళా ఒంటరిగా వ్యవసాయ బావి వద్దకు వెళుతుండగా, రాంబాబు అనే వ్యక్తి ఆమెపై రాడ్డుతో దాడి చేసి, మెడలో ఉన్న గొలుసును లాక్కెళ్లాడు. స్థానికులు అమెను ఆసుపత్రికి తరలించి, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2012లో కొడకండ్ల పోలీసులు రాంబాబుపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం నిందితుడిపై నేరం రూజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు పీపీ డేగల సత్యనారాయణ తెలిపారు.



నేటి చికెన్ ధరలు

	వెన్‌కాబ్	సుగుణ
	కిలో వెల రూపాయలలో	
ఫారం	86	86
హోల్‌సేల్	-	-
లైవ్ రిటైల్	101	101
డ్రెస్డ్ స్కిన్‌తో	141	146
స్కిన్‌లెస్	167	172

సుగుణ : 93479 48884, 93464 02116

వెన్‌కాబ్ : 98492 19870 న్యూస్‌టుడే, కాజీపేట

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని సర్కారు ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రీతిమీన కోరారు. మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా ఆసుపత్రిని సందర్శించారు. కలెక్టర్ వచ్చిన సమయంలో రోగులు అధిక సంఖ్యలో ఉండటంతో వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ భీంసాగర్‌ను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకం అమల్లోకి తీసుకొచ్చిన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. రోగులకు అసౌకర్యం కలగకుండా 400 కుర్చీలను ఏర్పాటు చేశామన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు, ఇతర మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ వేయి మందికి పైగా రోగులు వస్తున్నారని వారిని క్రమ పద్ధతిలో పంపించేందుకు 'ఆటోమెటిక్ పంచింగ్ టోకెన్ మిషన్' ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో తొక్కిసలాట తగ్గుతుందన్నారు. అత్యవసరమైన రోగులను తక్షణ వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఐసీయూ, మోడ్రన్ లేబర్ రూం ఏర్పాటు చేశామన్నారు. రూ.17 లక్షలతో లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

షోయబుల్లాఖాన్‌కు ఘన నివాళి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: నిజాం పాలకులకు వ్యతిరేకంగా కథనాలు రాసి హత్యకు గురైన షోయబుల్లాఖాన్ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నేనుసైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ మానుకోట వాసి కావడం గర్వనీయమన్నారు. అలాంటి మహాయోధుడి విగ్రహాన్ని ఆయన జయంతి నాటికి తమ సంస్థ ఆధ్వర్యంలో ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో మొక్కను నాటి నీరు పోశారు.



రూ.20తో మొదలెట్టి రూ.1.20 కోట్లకు..

- కొప్పూర్ ఆదర్శ మహిళా సంఘం ఆర్థిక లావాదేవీల ప్రగతి ఇది
- 27 ఏళ్లుగా ఒకే మహిళ నాయకత్వం
- 850 మంది సభ్యులతో నిర్వహణ

న్యూస్‌టుడే, భీమదేవరపల్లి

వారంతా కూలీ చేసే గ్రామీణ మహిళలు.. బ్యాంకింగ్ వ్యవస్థ ఎలా నడుస్తుందో తెలియదు... ప్రాథమిక విద్యను అభ్యసించని ఓ మహిళ నాయకత్వాన 27 ఏళ్లుగా పొదుపు చేస్తున్నారు. ఆ పొదుపులతో రుణాలు తీసుకొని ఆర్థిక అవసరాలు తీర్చుకోవడం.. మొహమాటాలకు పోకుండా పొదుపు, ఆర్థిక సూత్రాలు పాటించడంతో విజయవంతమయ్యారు. రూ.20లతో పొదుపులు ప్రారంభించిన మహిళలు నేడు రూ.1.20 కోట్ల ఆర్థిక లావాదేవీలు కొనసాగిస్తున్నారు. సభ్యులెవరైనా వారు పొదుపు చేసిన దానికి మూడు రెట్లు రుణం మంజూరు చేస్తారు. మంజూరులో ఎంత నిక్కచ్చిగా ఉంటారో వసూలులోనూ అంతే నిర్మోహమాటంగా వ్యవహరించడం వారి



ఆదర్శ మహిళా పొదుపు సంఘ భవనం

విజయ రహస్యం. పదిహేను ఏళ్లుగా సభ్యులెవరూ సంఘానికి బకాయి లేని ఘనత వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ ఆదర్శ మహిళా పొదుపు సంఘానిది. సమష్టిగా మహిళలు సాధించిన ఆర్థిక ప్రగతిపై 'న్యూస్‌టుడే' కథనం.

నాడు 110 మంది...నేడు 850 మంది..

గ్రామంలో 110 మహిళలు సంఘటితంగా ఏర్పడి 1990లో ఆదర్శ మహిళా పొదుపు సంఘం ఏర్పాటు చేసుకున్నారు. సంఘంలో చురుగ్గా వ్యవహరించే ఎడ్ల భారతిని సంఘ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. పాలకవర్గం సంఘ సభ్యుల ఆర్థిక అవసరాలు గుర్తించి నూటికి రూపాయి వడ్డీ తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. రూ.10 పొదుపు చేసే మహిళలు ప్రతి నెలా రూ.20 చెల్లించేందుకు ముందుకొచ్చారు. సంఘం ఆర్థిక వ్యవహారాలు ఈ ఏడాది రూ.1.20 కోట్లకు చేరాయి సంఘ సభ్యుల పొదుపులు రూ.25 లక్షలు కాగా సభ్యులకు సంఘం పంపిణీ చేసిన బోనస్ రూ.50 లక్షలు కావడం గమనార్హం. ఎడ్ల భారతి సంఘ ఆవిర్భావం నుంచి వ్యవహరిస్తున్నారు. అక్షర జ్ఞానం లేని భారతి సంఘ లెక్కలు ప్రతి నెల పాలకవర్గ సమావేశంలో నోటికి చెప్పడం నాయకత్వ పనితీరుకు నిదర్శనం. ప్రతి సభ్యురాలి పొదుపు, బోనస్, బీమా ఆర్థిక వ్యవహారాలను కంప్యూటరీకరణలో నమోదు చేస్తున్నారు.

శతశాతం రుణాల రికవరీ...

సభ్యుల పొదుపుకు మూడు రెట్లు రుణం మంజూరు చేస్తూ ఆర్థిక ప్రగతిలో వచ్చిన లాభాలను సంఘ సభ్యులకు బోనస్ రూపంలో పంపిణీ చేస్తున్నారు. రూ.70 వేలు, ప్రత్యేక అప్పు కింద రూ.30 వేల రుణంతో సభ్యులకు రూ.లక్ష వరకు రుణం ఇస్తున్నారు. సంఘ పాలకవర్గ ప్రతి నెల ఒకసారి సమావేశమై రుణం మంజూరు చేస్తారు. రుణ వసూళ్లకు ఐదుగురు సభ్యులను గ్రూపుగా విభజించి వారిని బాధ్యులుగా చేస్తారు. రుణాలు తీసుకున్న మహిళలు సక్రమంగా చెల్లించేలా కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడతారు. సభ్యులకు సామూహిక, అభయనిధి బీమా ప్రయోజనాలు కల్పిస్తున్నారు. సంఘంలో 65 ఏళ్లు నిండిన సభ్యులను మార్గదర్శకులుగా పిలుస్తారు. వీరి పొదుపులకు ప్రతి నెల రూపాయి వడ్డీ చెల్లిస్తారు. మార్గదర్శకులకు సగటున నెలకు రూ.200 నుంచి రూ.300 చెల్లిస్తున్నట్లు పాలకవర్గం తెలిపింది.

సమష్టి సహకారంతో నిర్వహణ

ఎడ్ల భారతి, అధ్యక్షురాలు



నేను పెద్దగా చదువుకోలేదు. 27 సంవత్సరాలుగా పొదుపు సమితి అధ్యక్షురాలిగా పని చేయడం ఆనందంగా ఉంది. ప్రతి నెల సమావేశంలో పొదుపులు, రుణాల చెల్లింపు వివరాలు పాలకవర్గంతో చర్చిస్తాం. రుణాలు సూచించిన తేదీలో చెల్లించని సభ్యురాళ్లను గుర్తించి వారికి అవగాహన కల్పించి రుణ వసూళ్లు చేస్తాం. రెండేళ్లు సక్రమంగా పొదుపు, రుణం చెల్లించిన సభ్యులకు ప్రత్యేక అప్పు మంజూరు చేస్తాం. సక్రమంగా చెల్లిస్తే అధిక రుణం తీసుకునేందుకు అవకాశముంది. సంఘానికి సొంత భవనం ఉంది.

నిర్వహణ సులువు.. సభ్యులకే లాభాలు..

–కొత్త సుజాత, కార్యదర్శి

పొదుపు సంఘంలో 850 మంది సభ్యులు ఉన్నా నిర్వహణ సులభమే. సభ్యులు పొదుపు, బోనస్, రుణాల వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేయడంతో సభ్యురాలి సంఖ్య నమోదు చేయగానే ఆ వివరాలు వస్తాయి. రుణం తీసుకున్న మహిళలు రూపాయి వడ్డీ చెల్లిస్తున్నారు. ఏటా సంఘం సాధించిన లాభాలను సభ్యులకే పంపిణీ చేస్తాం. పాలకవర్గ కమిటీ విషయంలో కఠిన నిర్ణయాలు ఉంటాయి. కమిటీ సభ్యులు బకాయి పడితే పాలకవర్గం పదవి కోల్పోతారు. వరుసగా మూడు సమావేశాలకు రాకుంటే తొలగిస్తాం.



100% స్వచ్ఛత

రైల్వేస్టేషన్లలో నీరు తాగాలన్నా, ఆహారం తీసుకోవాలన్నా భయం వేస్తుంది. రైళ్లలో, రైల్వేస్టేషన్లలోని మరుగుదొడ్లు వాడాలంటే కూడా వికారం వేస్తుంది. ప్రజల్లో నెలకొన్న ఈ భావన పోగొట్టడానికి స్వచ్ఛభారత్ స్ఫూర్తితో రైల్వే నడుం కట్టింది. రేల్ స్వచ్ఛత పఖ్వాడ (పక్షోత్సవాలు) పేరుతో ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు రోజుకో కార్యక్రమాన్ని చేపట్టి ప్రయాణికులకు స్వచ్ఛమైన నీరు, ఆహారంతోపాటు పరిశుభ్ర పరిసరాలను, రైళ్లను అందించాలని భావిస్తోంది. కొన్ని కార్యక్రమాలను రూపొందించి ఇందులో కొన్నింటిని ఇప్పటికే అమలు చేస్తోంది. రైల్వే, స్వచ్ఛభారత్ అభియాన్, తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఆ కార్యక్రమాలపై 'న్యూస్‌టుడే' కథనం.

– కాజీపేట, న్యూస్‌టుడే

- రైల్వేలో కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు
- పక్షోత్సవాలతో రూపకల్పన

అధికారి పర్యవేక్షణలో..


ప్రతి కార్యక్రమానికి అధికారులు పాల్గొని వారే స్వయంగా కార్యక్రమాలను రూపొందుచుకొని అమలు చేసే విధంగా కార్యక్రమాలను రూపకల్పన చేశారు. డివిజనల్ స్థాయి అధికారులకు ఒక్కో కార్యక్రమాన్ని అప్పగించి వారితోనే నిర్వహిస్తోంది. ఒక వేళ సదరు అధికారికి అప్పగించిన పనిలో ఎలాంటి లోపాలున్నా, ప్రయాణికుల నుంచి ఫిర్యాదు వచ్చినా సదరు అధికారి మీదే చర్యలు తీసుకునేలా కార్యక్రమాన్ని రూపొందించారు. డివిజనల్ స్థాయి అధికారులు స్వయంగా రైల్వేస్టేషన్లకు వచ్చి కార్యక్రమాలను నిర్వహిస్తూ వారు కూడా పాల్గొంటున్నారు. ముందుగా వారు రైల్వేస్టేషన్లను, రైళ్లను తనిఖీలు చేసి లోపాలను గుర్తించి పక్షం రోజుల్లోనే పరిష్కారం చూపేలా కార్యక్రమాన్ని రూపొందించారు. పనులు వేగవంతం కావడానికి అవకాశం ఏర్పడింది.

తేదీ 16న స్వచ్ఛ అవగాహన




స్వచ్ఛత మీద అవగాహన కార్యక్రమం పేరుతో రైల్వే 16 నుంచి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రతి రైల్వేస్టేషన్‌లో ఉదయాన్నే అధికారులు, పారిశుద్ధ్యం సిబ్బంది, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు రైల్వేస్టేషన్‌కు చేరుకొని ప్రతిజ్ఞ చేయాలి. ప్రయాణికులకు అవగాహన కలిగించాలి. చెత్త నిర్దేశించిన ప్రదేశంలోనే వేయాలని, లేకుంటే రూ.500 జరిమానా విధిస్తారనే విషయాలను తెలియజేస్తూ 'స్వచ్ఛ రేల్, స్వచ్ఛభారత్' అనే నినాదాలు చేయాలి. రైల్వే ఉద్యోగులకు వారివారి కార్యాలయాల పరిధిలో పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో తెలిపే విధంగా ఒక శిబిరాన్ని నిర్వహించారు.

17, 18న స్వచ్ఛ సంవాద్




ఈ రోజుల్లో స్వచ్ఛ సంవాద్ కార్యక్రమం నిర్వహించారు. దీనిని డివిజనల్ రైల్వే మేనేజర్ నిర్వహించారు. సదస్సులు, పోస్టర్ చిత్రీకరణ, నినాదాల పోటీలు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లను ఆహ్వానించి వారితో దగ్గర్లోని రైల్వేస్టేషన్లలో, రైల్వే కాలనీలలో, వివిధ విభాగాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

19, 20న స్వచ్ఛ స్టేషను



'ఏ1', 'ఏ' స్థాయి స్టేషన్లను ఎంచుకొని సామూహికంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. డివిజనల్ స్థాయి అధికారి స్టేషన్‌లో ఉన్న పారిశుద్ధ్య లోపాలను గుర్తించి అవి పరిష్కారమయ్యేలా చేశారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో కాజీపేట, వరంగల్‌లాంటి 'ఏ' స్థాయి రైల్వే స్టేషన్లలో లోపాలను గుర్తించి వాటిని సరి చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై దృష్టి పెడుతున్నారు. ప్లాస్టిక్ వస్తువులను ఎక్కడ పడితే అక్కడ పడేస్తే ఎలాంటి నష్టాలుంటాయో తెలిసేలా అవగాహన కల్పించారు. రైల్వేస్టేషన్‌లో చేసే ప్రతి కార్యక్రమాన్ని సీసీటీవీలోని ఫుటేజీని సేకరించి దానిని స్వచ్ఛభారత్ మంత్రిత్వ శాఖకు పంపారు.

21, 22న స్వచ్ఛ రైలు బండి



స్వచ్ఛ రేల్‌గాడీ పేరుతో రైళ్లలో పరిశుభ్రతపై దృష్టి పెట్టారు. అధికారులు, సిబ్బంది రైళ్లను తనిఖీ చేసి అందులోని అపరిశుభ్రత ప్రాంతాలను గుర్తించారు. ఈ రెండు రోజుల్లో అన్ని రైళ్లను తనిఖీ చేసి అపరిశుభ్రత ఉన్న ప్రాంతాలలో వెంటనే సిబ్బందిని రప్పించి శుభ్రం చేయిస్తారు. లోపాలను గుర్తించి వెంటనే వాటిని సరి చేశారు.

23, 24న స్వచ్ఛ పరిసర్



స్వచ్ఛ పరిసర్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రులు, పాఠశాలలు, కోచింగ్ డిపోలు, లాబీలు, స్టేషన్ పరిసర ప్రాంతాలలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తారు. రైల్వేకాలనీలు, రిటైరింగ్ గదులు, విశ్రాంతి గృహాలు, రన్నింగ్ గదులను శుభ్రపరుస్తారు. ఈ విభాగాలలో ప్లాస్టిక్ లేకుండా చూస్తారు. పరిసర ప్రాంతాలలో చెత్తను తొలగిస్తారు. కాలనీలో ఏర్పడిన వ్యర్థ పదార్థాలతో శక్తిని ఉత్పత్తి చేసే యంత్రాలను అమర్చాలని ఈ కార్యక్రమంలో పొందుపరిచారు. స్వచ్ఛ పరిసర్‌లో విద్యార్థులు పాల్గొనేలా చేస్తారు.

25, 26న స్వచ్ఛ ఆహారం




ప్రతి రైల్వేస్టేషన్‌లోని క్యాంటీన్‌లలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి రైలులోని పాంట్రికారులో వండుతున్న తీరు అక్కడి పరిసర పరిశుభ్రతను పరిశీలించాలి. పరిశుభ్రమైన ఆహారం వండేలా చర్యలు తీసుకోవాలి. ఆ ఆహారాన్ని తీసుకెళ్లి ఒక ప్రయాణికుడికి ఇచ్చి తినిపించి, ఎలా ఉందనే విషయాన్ని సేకరించాలి. అతను చెప్పిన వివరాలను రికార్డు చేసి అధికారులకు అందించాలి.

27, 28న స్వచ్ఛ నీరు



అన్ని నీటి సరఫరా ట్యాంకులు, పిల్టర్‌లు, నల్లాలు, రిఫ్రిజిరేటర్లలో నీటిని తనిఖీ చేయాలి. రైల్వేస్టేషన్లలో, కాలనీలు, పాఠశాలలు ఆసుపత్రిలలో అందించే తాగునీటి సరఫరా, ట్యాంకులలో నీరు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అన్ని ప్రాంతాలలో నీటి కొరత లేకుండా చూడాలి. సరఫరా చేసే నీటి నమూనాలు సేకరించి వాటిని ప్రయోగశాలలకు పంపించాలి. ఒక వేళ లోపాలుంటే వెంటనే సరిచేయాలి. భూగర్భజలాలు పెంచుకోవడానికి ఇంకుడుగుంతలాంటి నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి.

సమీక్ష : 31వ తేదీన పదిహేను రోజుల్లో చేసిన పని మీద సమీక్ష చేస్తారు. ఎక్కడెక్కడ ఎలాంటి కార్యక్రమాలు చేశారు. వాటి ఫలితాల్లో ఏమైనా తేడాలున్నాయా? ఇది ఇలాగే కొనసాగడానికి తీసుకోవాల్సిన చర్యలపై తగు జాగ్రత్తలు తీసుకుంటారు.



29న స్వచ్ఛ ప్రసాదన్



స్వచ్ఛప్రసాదన్ పేరుతో ప్రతి రైల్వే స్టేషన్‌లోని మరుగుదొడ్లను శుభ్రం చేస్తారు. అందులో ఏమైన మరమ్మతులున్నా సరి చేస్తారు. ఈ విషయంలో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యాలను అధికారులకు తెలియజేసేలా చర్యలు తీసుకుంటారు. రైల్వేస్టేషన్‌లలో, కాలనీ పరిసరాలలో బహిరంగ మల విసర్జన చేసే ప్రాంతాలలో అవగాహన కల్పించి అక్కడ కొన్ని మరుగుదొడ్ల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటారు.

30న స్వచ్ఛ పోటీలు



రైల్వేలో సిబ్బంది ఆరోగ్యకరమైన పరిశుభ్రత పోటీలను నిర్వహిస్తారు. వివిధ విభాగాల మధ్య పరిశుభ్రత మీద పోటీ ఉంటుంది. ఇలా ఒకరినొకరు పోటీ పడటంతో కార్యాలయాలు శుభ్రంగా ఉంటాయని భావన.

200 రైళ్లలో ప్రత్యేక శ్రద్ధ : భారతీయ రైల్వేలో 200 రైళ్లను ఎంపిక చేసి ప్రత్యేక స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అధికారులు ఈ రైళ్లను తనిఖీ చేసి అందులో లోపాలను గుర్తించి చర్యలు తీసుకుంటారు.

24/7 విజ్ఞాన సేవలు

అందుబాటులో కేయూ గ్రంథాలయం



న్యూస్‌టుడే– కేయూ క్యాంపస్

ఉమ్మడి జిల్లాల్లోని చాలా గ్రంథాలయాలు పని దినాల్లో నిర్దిష్ట సమయంలో మాత్రమే సేవలందిస్తుంటాయి. కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని కేంద్ర గ్రంథాలయం దీనికి భిన్నంగా సేవలు అందిస్తోంది. 24 గంటలు విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి పీజీ కేంద్రంగా 1967లో ఏర్పాటైన ఈ గ్రంథాలయం అంచెలంచెలుగా ఎదిగి నేడు లక్షలాది పుస్తకాలను కలిగి ఉంది. క్యాంపస్‌లోని పీజీ, పరిశోధక విద్యార్థులకే కాకుండా, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి వరంగా మారింది. వారం మొత్తం 24 గంటలు తెరిచే ఉంటూ విజ్ఞానాన్ని అందిస్తూ సిల్వర్‌జుబ్లీ ఉత్సవాలను నిర్వహించుకుంటుంది. కేయూ గ్రంథాలయం అందిస్తున్న సేవలపై "న్యూస్‌టుడే" ప్రత్యేక కథనం.

1,81,988 పుస్తకాలు..

విద్యార్థులకు, అధ్యాపకులకు సరిపడేలా అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కేయూలోని 42 పీజీ, ఇతర వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులకు అకాడమిక్ పుస్తకాలను అందిస్తోంది. మొత్తం 1,81,988 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 1,54,158 అకడమిక్, 7960 రెఫరెన్స్, 13021 బహుమతిగా సేకరించినవి, 2763 ఎస్సీ ఎస్టీ బుక్‌బ్యాంక్ పుస్తకాలు, 4086 పరిశోధకులు రాసిన సిద్ధాంత గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. పుస్తకాలను సభ్యులు ఇంటికి తీసుకెళ్లి చదువుకోవడానికి కూడా అనుమతి ఉంది. మార్కెట్‌లోకి కొత్త పుస్తకాలు వచ్చిన వెంటనే ఏటా కొనుగోలు చేసి విద్యార్థుల అవసరాలను తీర్చుతున్నారు గ్రంథాలయ నిర్వాహకులు.



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

సభ్యులు వీరే		
విద్యార్థుల సంఖ్య : 2575	పరిశోధకులు : 956	అధ్యాపకులు : 164

సభ్యత్వం ఎవరెవరికంటే..

కేయూలోని అన్ని విభాగాల, కళాశాలల విద్యార్థి, పరిశోధక, బోధన, బోధనేతర వర్గాలకు దీనిలో సభ్యత్వం ఉంటుంది. . వీరికి పుస్తకాలను ఇంటికి కూడా ఇస్తారు. నిర్దేశించిన సమయానికికల్లా తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. అధ్యాపకులకు నెలకు 3 పుస్తకాలను, విద్యార్థులకు 15 రోజులకు మూడు పుస్తకాలను పరిశోధకులకు నెలకు 4 పుస్తకాలను, ఎస్సీ, ఎస్టీ వారికి 15 రోజులకు మూడు పుస్తకాలు ఇంటికి ఇస్తారు.

సద్వినియోగం చేసుకుంటున్నారు

–డాక్టర్ పి.సదానందం, కేయూ గ్రంథాలయ మెంబర్ ఇన్‌ఛార్జి



24 గంటలపాటు గ్రంథాలయం అందుబాటు ఉంటుంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. మారుతున్న సిలబస్‌లకు అనుగుణంగా కొత్త పుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్నాం. ఏమైన సమస్యలుంటే మా సిబ్బంది దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారు.

అధునాత సౌకర్యాలు

- విద్యార్థులకు అన్ని రకాల అధునాత సౌకర్యాలను అందిస్తున్నారు. ఇందుకోసం 80 కంప్యూటర్లతో ప్రత్యేకంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పుస్తకాలను, జర్నల్స్‌ను చూసుకొనే అవకాశాలు కల్పించారు. యూజీసీ ఇన్‌ప్లీబినెట్ వారు రూపొందించిన వెబ్‌సైట్ ఇ- సోధ్‌సిందు ద్వారా 15 వేలకుపైగా ఆన్‌లైన్ పరిశోధనా జర్నల్స్‌ను, 31,35,000 లక్షలకు పైగా ఇ-పుస్తకాలను అధ్యయనం చేసే అవకాశాలున్నాయి.
- కేయూ వెబ్‌సైట్ ద్వారా గ్రంథాలయంలోని పుస్తకాల వివరాలను తెలుసుకునే అవకాశముంది.
- ఉచితంగా వైఫై సౌకర్యం.
- జిరాక్స్ కేంద్రం కూడా ఉంది.
- 24 గంటలకు తాగునీటి సౌకర్యంతోపాటు పుస్తకాలను భద్రపరుచుకోవడానికి సౌకర్యం.
- వాటర్‌కూలర్‌లు, వీల్‌ఛైర్‌లు అందుబాటులో ఉన్నాయి.
- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి 24 గంటలపాటు రీడింగ్ హాల్ తెరిచే ఉంటుంది. ఇందులో అన్నిరకాల వార్తాపత్రికలు, పోటీ పరీక్షలకు సంబంధించిన గ్రంథాలు, జర్నల్స్ అందుబాటులో ఉంటాయి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అకడమిక్, పోటీ పరీక్షల విద్యార్థులకు అందుబాటులో గంథాలయం ఉంటుంది.

ఆదర్శ మార్కెట్‌గా కేసముద్రం

- ఈనామ్ అమలుపై మంత్రి హరీశ్‌రావు ప్రశంస
- త్వరలో ప్రధానమంత్రి ఆన్‌లైన్‌లో పరిశీలించే అవకాశం





కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఈ నామ్‌ను విజయవంతంగా అమలు చేస్తూ రాష్ట్రంలోని ఇతర మార్కెట్లకు ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్రంలోని ఇతర మార్కెట్లకు భిన్నంగా ప్రత్యక్ష పద్ధతిలో ఖరీదులు నిర్వహిస్తున్న మార్కెట్ రాష్ట్రంలో కేసముద్రం ఒక్కటే. మార్కెట్‌లో నామ్ అమలు తీరుపై మార్కెటింగ్ శాఖమంత్రి హరీశ్‌రావు, ముఖ్య కార్యదర్శి పార్థసారథి, మార్కెటింగ్ సంచాలకులు లక్ష్మీబాయిలు మార్కెట్ ఛైర్మన్ ఉమారెడ్డి, కమిటీ, పాలక మండలి, వ్యాపారులు, సిబ్బందిని ప్రశంసిస్తూ సమాచారం పంపించారు. కమిషనర్ లక్ష్మీబాయి కార్యదర్శి అంజిత్‌రావుకు ఫోన్ చేసి అభినందించారు. నేడో రేపో ప్రధానమంత్రి ఫోన్లో మాట్లాడే అవకాశముందని తెలిపారు. నామ్ అమలుతీరుపై 'న్యూస్‌టుడే' కథనం.

ఒకే మార్కెట్ విధానం లక్ష్యంతో..: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు దేశవ్యాప్తంగా ఒకే మార్కెట్ విధానాన్ని అమలు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2016 ఏప్రిల్ 14న నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతీయ వ్యవసాయ విపణి(నామ్) పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో మొత్తం 158 వ్యవసాయ మార్కెట్లు ఉండగా 44 మార్కెట్లలో నామ్ అమలు చేయాలని నిర్ణయించారు. మొదట వరంగల్, నిజామాబాద్, తిరుమలగిరి, మల్లక్‌పేట్, బాదేపల్లి మార్కెట్లలో పాయిలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఆ తర్వాత దశల వారీగా రాష్ట్రంలోని 39 మార్కెట్లలో ప్రారంభించారు. అందులో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఒకటి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వరంగల్, జనగామ, నర్సంపేట, కేసముద్రం వ్యవసాయ మార్కెట్లల్లో నామ్ అమలు చేస్తున్నారు.

కేసముద్రం మార్కెట్ ప్రత్యేకం..: 1965లో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ప్రారంభించారు. రాష్ట్రం. అంతటా అడ్తి పద్ధతిలో క్రయవిక్రయాలు చేస్తుండగా ఇక్కడ మాత్రం ప్రత్యక్ష పద్ధతిలో ఖరీదు నిర్వహిస్తున్నారు. ప్రత్యక్ష పద్ధతిలో ఖరీదు పూర్తిగా రైతు సమక్షంలోనే నిర్వహిస్తారు. ఖరీదు దారుడికి, రైతుకు మధ్య మార్కెట్ అధికారులు మధ్య వర్తిత్వం నిర్వహిస్తారు. రైతు తమ సరకును మార్కెట్ యార్డులో రాశిగా పోస్తారు. రాశుల వద్దకే వ్యాపారులు వచ్చాక రైతు సమక్షంలోనే మార్కెట్ సిబ్బంది వేలంపాట నిర్వహించి ధర నిర్ణయిస్తారు. నింపకాలు, తూకం పూర్తి చేశాక యార్డులోని కంప్యూటరు విభాగంలో తక్‌పట్టీ పెట్టుకొని వెళ్తే ఎలాంటి కమీషన్ తీసుకోకుండా అదే రోజు వ్యాపారులు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పద్ధతితో రైతుకు నూటికి రూ.3 నుంచి రూ.4 చొప్పున ఆదా అవుతుంది. ఇప్పటికే ప్రత్యక్ష పద్ధతిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్న ఈ మార్కెట్‌లో నామ్ అమలుకు ఎక్కువ అవకాశాలున్నాయి..

రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టి : కేసముద్రం మార్కెట్‌లో 2016 సెప్టెంబరు 6న నామ్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. సరైన అవగాహన లేకపోవడంతో రైతులు, వ్యాపారుల నుంచి వ్యతిరేకత రావడంతో పాత పద్ధతిని కొనసాగిస్తూ వచ్చారు. మార్కెట్ కమిటీ, పాలక మండలి చొరవ తీసుకొని పలుమార్లు వ్యాపారులు, రైతు, కార్మిక నాయకులతో చర్చలు నిర్వహించి చివరకు అందరి సహకారంతో ఈనెల 18న కేసముద్రం మార్కెట్‌లో ఈ నామ్‌ను ప్రారంభించారు. కొన్ని రోజులుగా ఈ నామ్‌ను విజయవంతగా అమలు చేస్తుండటంతో మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావుతోపాటు, మార్కెటింగ్ సంచాలకులు, ముఖ్య కార్యదర్శి దృష్టి ఈ మార్కెట్‌పై పడింది. ఇదే విధంగా అమలు చేయాలని ప్రశంసిస్తూ సమాచారం పంపించారు. ప్రధానమంత్రి స్వయంగా ఈ నామ్ అమలు తీరుపై ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్నారని నేడో రేపో కేసముద్రం మార్కెట్ అధికారులతో మాట్లాడే అవకాశముందని రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి సమాచారం వచ్చింది. ఈ నామ్ అమలును ప్రశంసించడంతోపాటు దేశంలోనే కేసముద్రం మార్కెట్‌ను ఆదర్శ మార్కెట్‌గా రూపొందించే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

మళ్లీ మొదలైంది..!

నగరంలో ఒకే రోజు నాలుగు చోరీలు

వరుస ఘటనలతో బెంబేలు



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: గత కొంతకాలంగా చోరీ ఘటనలు ఎక్కువ జరగకపోవడంతో వరంగల్ నగరం ప్రశాంతంగా ఉంది. కానీ సోమవారం సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలో దొంగలు రెచ్చిపోయారు. పట్టపగలే తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడి అందిన కాడికి దోచుకున్నారు. కాజీపేట, హన్మకొండ ప్రధాన రహదారి పక్కనే ఉన్న పోస్టల్‌కాలనీలో రెండిళ్లలో బ్యాంక్‌కాలనీలలో ఒక ఇంటిలో చోరీలు చేశారు. పోస్టల్‌కాలనీలో ఇళ్లలో కొంత బంగారం, నగదును అపహరించుకెళ్లారు. బ్యాంక్ కాలనీలో నివాసముంటున్న విశ్రాంత ఉద్యోగి ఇంట్లో నగదు మాత్రమే అపహరించుకెళ్లారు. భవానీనగర్‌లో రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న మహిళా మెడలో నుంచి గొలుసును అపహరించేందుకు యత్నించారు. ఈ ఘటనలన్నీ పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. ఒకే రోజు.. ఒకే పోలీసుస్టేషన్ పరిధిలో ఇవి జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పాట్రోలింగ్‌ను మరింత పెంచారు.

పట్టపగలే..

పోస్టల్‌కాలనీలో సోమవారం గంట వ్యవధిలోపే ఇంటికి తాళం వేసి ఉన్న రెండిళ్లలో పట్టపగలే చోరీలు చేశారు. పోస్టల్‌కాలనీ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇళ్లలలో చోరీలు చేయడం సంచలనం కలిగించింది. రాత్రి వేళ్లల్లో చోరీలు చేయడం సాధారణం. కానీ పట్టపగలే జరగడం చర్చనీయాంశమైంది. రెండిళ్లలో చోరీలు జరిగిన ప్రదేశంలో ఒకే విధంగా డోర్‌లాక్‌లను పగులగొట్టి లోపలకు వెళ్లి బీరువాలోని నగలు, నగదును ఎత్తుకెళ్లారు. బ్యాంక్‌కాలనీలోనూ ఇదేవిధమైన చోరీ జరగడంతో మూడు ప్రాంతాలలో చేసింది. ఒక్కరే అని పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలో మధ్యాహ్నం సమయంలో చోరీలు చేసిన వారిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కాలనీలో రెక్కీ వేసి అదను చూసి చోరీలు చేసేవారు ఇలాంటి వాటికి పాల్పడతారని వారు ఊహిస్తున్నారు. ఇతర ప్రాంతాలలో చోరీలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు.

పాత నేరస్థుల పనేనా...

గతంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో చోరీలు చేసిన వారే ఈ ఘటనలకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. గతంలోనూ కేయూ పరిధిలో వరుస చోరీలు జరిగాయి. అపార్ట్‌మెంట్లలోనూ చోరీలు చేశారు. ఇలా చేసిన వారిలో ఒక బ్యాచ్ తిరిగి చోరీ చేసి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాత నేరస్థుల రికార్డులను పోలీసులు పరిశీలిస్తున్నారు. చోరీలపై పోలీసులు అంచనాకు వచ్చారు. నిందితులను గుర్తించేందుకు పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. వీరు నగరంలో పలు ప్రాంతాలలో చోరీలు చేసిన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. వరంగల్ బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలలో పాత నేరస్థుల కోసం గాలిస్తున్నారు.

సుబేదారి పోలీసుస్టేషన్‌కు ఏసీపీ

సుబేదారి పోలీసుస్టేషన పరిధిలో వరుస చోరీలు జరగడంతో మంగళవారం హన్మకొండ ఏసీపీ మురళీధర్ పోలీసుస్టేషన్‌కు వచ్చారు. సిబ్బంది సంఖ్యను పరిశీలించారు. పోలీసుస్టేషన్ పరిధిలో అన్ని రూట్లలో పోలీసులు విస్తృతంగా పాట్రోలింగ్ చేయాలని సూచించారు. తిరిగి చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. 'సుబేదారి పోలీసుస్టేషన్ పరిధి ఎక్కువగా ఉండటంతో ఇక్కడ చోరీలు జరిగే అవకాశం ఉంటుంది. అందుకోసం సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. ప్రజలకు పోలీసులు కనిపించే విధంగా పాట్రోలింగ్ చేయాల'ని ఏసీపీ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

క్రైం కార్నర్

జనగామ కలెక్టరేట్‌లో పై అంతస్తు నుంచి పడిన వృద్ధుడు



గాయపడిన గోపాల్‌రెడ్డి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ కలెక్టరేట్ కార్యాయంలో పని నిమిత్తం వచ్చిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు కార్యాలయంలోని మొదటి అంతస్తు నుంచి కింద పడి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కలెక్టరేట్ కార్యాలయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ మండలం పెద్దరామన్‌చర్ల గ్రామానికి చెందిన 80 సంవత్సరాల వంగ గోపాల్‌రెడ్డి కలెక్టర్ కార్యాలయంలో అర్జీ ఇవ్వడానికి వచ్చారు. మొదటి అంతస్తుపైన నిలబడిన అతడు చిన్న గోడ వద్ద నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. కాగా వృద్ధుడిని ఏరియా ఆసుపత్రిలో సంయుక్త కలెక్టర్ వనజాదేవి పరామర్శించారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

మెట్టుపల్లి(మొగుళ్లపల్లి) న్యూస్‌టుడే: కడుపు నొప్పి భరించలేక ఓ వివాహిత ఉరి వేసుకుని మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చల్ల రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొంరోజు మౌనిక (25) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలోనే కడుపు నొప్పి మొదలైంది. చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేక సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నవాబుపేట (చిట్యాల) న్యూస్‌టుడే: మండలంలోని నవాబుపేట ఎస్సీ కాలనీలో పేకాట ఆడుతున్న నలుగురిని మంగళవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై స్వామి కథనం ప్రకారం.. నవాబుపేటలోని ఎస్సీ కాలనీలో కొంతమంది నిత్యం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం కాలనీపై తమ సిబ్బందితో దాడి చేయగా పేకాట ఆడుతున్న వారిలో నలుగురు మాత్రమే దొరికారన్నారు. మరికొందరు తప్పించుకుని పారిపోయారని ఎస్సై పేర్కొన్నారు. పట్టుకున్న వారిలో నవాబుపేటకు చెందిన మట్టెవాడ చందర్, మట్టెవాడ రాజు, మిర్యాల బాలయ్య, గోల్కొండ కుమార్ అనే వారున్నారన్నారు. పారిపోయిన వారికోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే వారందరినీ పట్టుకుని కేసులు నమోదు చేస్తామని ఎస్సై స్వామి తెలిపారు.

గుట్కా పొట్లాల పట్టివేత

చిట్యాల, న్యూస్‌టుడే: మండల కేంద్రం శివారు వెంకట్రావుపల్లికి చెందిన రేష్మ కిరాణంపై మంగళవారం రెండో ఎస్సై స్వామి దాడిచేసి అక్రమంగా అమ్మకానికి సిద్ధంగా ఉన్న అంబర్, గుట్కా పొట్లాలను పట్టుకున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు. పట్టుకున్న అంబర్, గుట్కా పొట్లాల విలువ సుమారు రూ.1600 ఉంటుందన్నారు. దుకాణం యజమాని మునీర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిట్యాల, న్యూస్‌టుడే: మండలంలోని చల్లగరిగెలో సోమవారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై స్వామి మంగళవారం తెలిపారు. రేగొండ మండలం రావులపల్లికి చెందిన పులిదేవేందర్‌రెడ్డికి చెందినదిగా గుర్తించామన్నారు. చిట్యాల మండలం గిద్దెముత్తారం శివారు కాల్వపల్లి నుంచి అక్రమంగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి దేవేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



ఈశ్వర్ (పాత చిత్రం)

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గోవిందరావుపేట గ్రామానికి చెందిన రామచంద్రపు ఈశ్వర్(13) మంగళవారం మృతిచెందాడు. సోమవారం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా తల్లిదండ్రులు ఆ విద్యార్థిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని పస్రా ఎస్సై మహేందర్‌కుమార్ చెప్పారు. ఈశ్వర్ మృతదేహానికి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించి మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

ఐనవోలు, వర్ధన్నపేట రూరల్, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామ శివారు రాంనగర్‌లో మంగళవారం వెలుగుచూసింది. ఐనవోలు ఎస్సై నాగరాజు కథనం ప్రకారం... ఐనవోలు మండలం నందనం గ్రామ శివారు రాంనగర్‌కు చెందిన మరిక్కుల శ్రీకాంత్(20) వరంగల్‌లో ఐటీఐ చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం బావి దగ్గర నుంచి ఇంటికి వెళ్తున్నానని తన తాతకు చెప్పి బయలుదేరిన శ్రీకాంత్ ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం తాతకు వెతకగా చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి తాత కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

ఖానాపురం, న్యూస్‌టుడే: ఖానాపురం గ్రామ శివారు పెద్దమ్మగడ్డకు చెందిన మెలుగూరి కుమారస్వామి(44)చెట్టుపై నుంచి పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కుమారస్వామి ఈనెల 21న గ్రామ సమీపంలోని మర్రిచెట్టు ఎక్కి కొమ్మలు కొడుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. కుటుంబసభ్యులు నర్సంపేట, ఎంజీఎంలో చికిత్స చేయిస్తుండగా మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య ప్రమీల, కుమార్తె ఉన్నారు. కుటుంబాన్ని నేతలు ప్రకాశ్‌రావు, శ్రీను తదితరులు పరామర్శించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు.



మృతి చెందిన కుమారస్వామి

మద్యం మత్తులో కారుతో వీరంగం

- ☛ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తి మృతి
- ☛ కేసు నమోదు చేసిన పోలీసులు

వాజేడు, న్యూస్‌టుడే: వాజేడు మండలం మండపాక గ్రామ సమీపంలో సోమవారం రాత్రి మద్యం మత్తులో కారువేగంగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన వ్యక్తిపై వాజేడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన రఘునాథ్, సొప్పరి సతీశ్(22) ద్విచక్ర వాహనంపై వెంకటాపురం వెళ్తుండగా మండపాక సమీపంలో ఏటూరునాగారం నుంచి వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టి ఈడ్చుకు వెళ్లడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిలో సతీశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులు 108 వాహనానికి సమాచార మందించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులను 108 వాహనంలో ఏటూరునాగారం ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ములుగు సమీపంలో సొప్పరి సతీశ్(22) మృతిచెందాడు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు యజమానిని వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన గుంజి లక్ష్మయ్యగా పోలీసులు గుర్తించారు. మృతుడి సోదరుడు సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న కుమార్

టేకుమట్ల, న్యూస్‌టుడే: అప్పుల బాధతో తీవ్రమనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కుందనపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకట్రావ్‌పల్లికి చెందిన రాగుల కుమార్‌యాదవ్(25) మండలంలోని కుందనపల్లిలో కొంత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. కాగా ఇటీవల కురిసిన వర్షానికి పత్తి పంట దెబ్బతింది. ఈ పంట కోసం చేసిన అప్పు అధికంగా ఉందని తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం రాత్రి 10గంటలకు ఇంటి వద్ద ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, కుమాడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమేదు చేసినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. వైస్ ఎంపీపీ సట్ల కొంరయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రెడ్డి మల్లారెడ్డి, సర్పంచి సుంకరి ప్రసన్నారాణి శ్రీనివాస్, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు

మధ్యాహ్న భోజన బిల్లులందేనా?

ఏజెన్సీ నిర్వాహకుల ఇబ్బందులు


కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో వంట చేస్తున్న మహిళ

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యారంగానికి కోట్ల రూపాయలు కేటాయిస్తున్నా కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు నెలకొన్నాయి. జనగామ జిల్లాలో పలు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం వండుతున్న ఏజెన్సీ నిర్వాహకులకు మూడు నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో 356 ప్రాథమిక పాఠశాలలు, 70 ప్రాథమికోన్నత పాఠశాలలు, 109 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు విద్యకు దూరం కావొద్దనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం పథకాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వం రెండేళ్లుగా విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్నభోజనం అందిస్తోంది. ఇటీవల విద్యార్థులకు అందజేసే మొత్తాన్ని పెంచింది. ప్రతి వారంలో మూడు రోజుల పాటు గుడ్డు అందజేస్తున్నారు. వంట చేసే మహిళా సంఘాల సభ్యులకు ప్రతి నెలా బిల్లులు ఇవ్వడం లేదు. ప్రతి నెలా బిల్లులను అందజేసేందుకు గాను సెప్టెంబర్ వరకు ప్రభుత్వం నిధులు అందజేసింది. జిల్లాలో 13 మండలాలు ఉండగా ఐదు మండలాల్లో ఏజెన్సీ నిర్వాహకులకు బిల్లులు ఇవ్వలేదు.

మూడు నెలలుగా అందని బిల్లులు

స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, నర్మెట్ట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాల్లో మధ్యాహ్నభోజనం బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. గత విద్యా సంవత్సరంలో ఏప్రిల్, ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూన్, జులై నెలలకు సంబంధించిన బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వం మధ్యాహ్నభోజనం బిల్లుల తయారీలో మార్పులు చేసింది. గతంలో పాఠశాలలో మధ్యాహ్నభోజనం చేసిన మొత్తం విద్యార్థులకు సంబంధించి నెలవారీగా ఒకటే బిల్లు తయారుచేసేది. ఏప్రిల్‌లో వచ్చిన కొత్త విధానం ప్రకారం మధ్యాహ్నం భోజనం తినే విద్యార్థుల్లో బీసీ, ఓసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు అందజేసిన గుడ్లకు సంబంధించి విడివిడిగా నాలుగు రకాల బిల్లులు తయారుచేసి ఎంఈవో కార్యాలయానికి పంపించాలి. విద్యార్థుల కులాల ఆధారంగా బిల్లులు తయారు చేయడం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారింది. పాఠశాల నిర్వహణ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూనే నెలనెలా మధ్యాహ్నభోజన బిల్లుల నివేదిక తయారుచేసి అందజేస్తున్నా.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. పాఠశాలల్లో 100 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున మధ్యాహ్న భోజనం వండే మహిళలకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.వేయి గౌరవ వేతనం అందజేస్తోంది. వారికి గౌరవ వేతనాలను కూడా సక్రమంగా అందజేయడం లేదు.

ఉపకోశాధికారి కార్యాలయాల్లో నిలిచిపోయిన బిల్లులు

ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నెలనెలా మధ్యాహ్నభోజనం బిల్లుల నివేదికలు తయారుచేసి ఎంఈవోలకు పంపించిన తర్వాత వాటిని క్రోడీకరిస్తారు. ఎంఈవో కార్యాలయంలో అన్ని పాఠశాలలకు సంబంధించి మధ్యాహ్నభోజనం బిల్లుల నివేదిక తయారుచేసి నెలకోసారి ఉపకోశాధికారి కార్యాలయానికి పంపిస్తారు. ఉపకోశాధికారి వాటిని పరిశీలించి నిర్ణీత మొత్తానికి బిల్లులను మంజూరు చేస్తూ సంబంధిత బ్యాంకుకు పంపిస్తారు. బ్యాంకు అధికారులు వాటిని పరిశీలించి నగదు అందజేస్తారు. ఆ తర్వాత పాఠశాలల వారీగా ఏజెన్సీ నిర్వాహకులకు చెక్కుల రూపంలో బిల్లుల సొమ్ము అందజేస్తారు. స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, నర్మెట్ట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాల నుంచి ఎంఈవోలు పంపించిన మధ్యాహ్న భోజనం బిల్లుల నివేదికలు ఉపకోశాధికారి కార్యాలయాల్లో నిలిచిపోతున్నాయి. ఉపకోశాధికారి కార్యాలయాల అధికారులు వాటిని పరిశీలించి సంబంధిత బ్యాంకులకు పంపించడంలో నిర్లక్ష్యం చేస్తుండడంతో జాప్యం జరుగుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్ ఎంఈవో తయారు చేసిన బిల్లుల నివేదికలు స్థానిక ఉపకోశాధికారి కార్యాలయంలో రోజులకొద్దీ మూలుగుతుండడమే దీనికి నిదర్శనం. ఉపకోశాధికార్యాలయ అధికారులు పలు సాకులు చూపుతూ బిల్లులను తొక్కిపెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మూడు నెలల బిల్లులందక అవస్థలు: గట్టు యాదమ్మ, మధ్యాహ్నభోజనం నిర్వాకురాలు, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



ఏప్రిల్, జూన్, జులై నెలలకుగాను మధ్యాహ్నభోజనం బిల్లులు రూ.60 వేలు అందక అవస్థలు పడుతున్నాం. నెలనెలా బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పులు పెరిగిపోతున్నాయి. విద్యార్థులకు భోజనం వండేందుకు నానా అగచాట్లు పడుతున్నాం. వడ్డీకి అప్పులు తెచ్చి కూరగాయలు, పప్పులు, నూనెలు, వంట చెరకు కొనుగోలు చేసి పిల్లలకు భోజనం వండుతున్నాం. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం కూడా సక్రమంగా అందడంలేదు. కిరాణ దుకాణం యజమాని అప్పు తీర్చమని అడుగుతున్నాడు. అధికారులు సకాలంలో బిల్లులు అందజేయాలి.

నిధుల కొరత లేదు

–యాదయ్య, జిల్లా విద్యాశాఖాధికారి, జనగామ జిల్లా

జిల్లాలోని 13 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం బిల్లులకు సంబంధించి నిధుల కొరత లేదు. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ప్రభుత్వం బడ్జెట్ మంజూరు చేసింది. కొన్ని మండలాల్లో మధ్యాహ్నభోజనం బిల్లుల చెల్లింపులో సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ మండలాల ఎంఈవోలు మధ్యాహ్నభోజన బిల్లుల నివేదికలను తయారుచేసి ఆయా మండలాల్లోని ఉపకోశాధికారి కార్యాలయాలకు పంపించారు. అక్కడే జాప్యం జరుగుతున్నట్లు ఎంఈవోల ద్వారా తెలిసింది. దీనిపై జిల్లా ఉపకోశాధికారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా.

రామప్పలో పురావస్తు శాఖ అధికారుల కొలతలు


రామప్పలో కొలతలు తీస్తున్న పురావస్తు శాఖ అధికారులు

రామప్ప(వెంకటాపూర్), న్యూస్‌టుడే: కాకతీయుల కళాక్షేత్రమైన రామప్పలో మంగళవారం పురావస్తుశాఖ అధికారులు కొలతలు చేపట్టారు. ఈ నెల 19న కురిసిన భారీ వర్షానికి కూలిన రామప్ప ప్రహరీని ఫోర్‌మెన్ మల్లేశంతో కలిసి ఏఈ జిలానీ, సర్వేయర్ ప్రశాంత్‌లు ముందుగా పరిశీలించారు. అనంతరం చేపట్టిన కొలతల్లో 40 మీటర్ల పొడవున గోడ కూలినట్లు తేలింది. పురాతన రాళ్లు ఎన్ని విరిగిపోయాయి. అవి ఎంత మందంతో ఉన్నాయి? వాటి పొడవు, వెడల్పు ఎంత ఉన్నాయి? ఎంతవరకు రాళ్లు విరిగిపోయి నష్టం వాటిల్లింది. తిరిగి బాగు చేయడానికి ఎంత సమయం పడుతుంది. ఎన్ని నిధులు కేటాయిస్తే పనులు సజావుగా సాగుతాయి? ఇంకా మిగతా గోడలు ఏమైనా దెబ్బతిన్నాయా? తదితర స్థితిగతులను పరిశీలించారు. సర్వేలో పేర్కొన్న సమాచారాన్ని త్వరలోనే ప్రభుత్వానికి పంపించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పురావస్తుశాఖ రామప్ప కో ఆర్డినేటర్ నాగరాజు, రమేష్, హసన్ తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ సీఐ వేధిస్తున్నారని రాస్తారోకో


ఎక్సైజ్ కార్యాలయం ముందు రాస్తారోకో చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

నర్సంపేట రూరల్, న్యూస్‌టుడే: నర్సంపేట ఎక్సైజ్ సీఐ శశికుమారి వేధిస్తున్నారంటూ వివిధ సంఘాల నాయకులు ఎక్సైజ్ కార్యాలయం ముందు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఎక్సైజ్ పోలీసులు, బాధితుడు, వివిధ సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్గొండి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన నీలం పైడయ్యను అకారణంగా శారీరకంగా, మానసికంగా హింసించారని, నగదు డిమాండ్ చేశారని ఆరోపించారు. బాధితుడు నీలం పైడయ్యపై కేసు తొలగించి సీఐ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో చేయడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న నర్సంపేట ఎస్సై నాగ్‌నాథ్ అక్కడికి చేరుకొని రాస్తారోకో చేసేవారిని శాంతిపజేసే ప్రయత్నం చేయగా ఫలించలేదు. సీఐ కొత్త దేవేందర్‌రెడ్డి రాస్తారోకో చేస్తున్న నాయకులతో మాట్లాడి వారిని ఎక్సైజ్ సీఐ శశికుమారి వద్దకు తీసుకెళ్లి చర్చించారు. దీనిపై ఎక్సైజ్ సీఐ శశికుమారిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గుడిమహేశ్వరం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈత, తాటి చెట్లు తొలగించారని గీత కార్మికులు చేసిన ఫిర్యాదు మేరకు నీలం పైడయ్యను విచారణకు పిలిచామన్నారు. అతని వద్ద నగదు డిమాండ్ చేయలేదన్నారు.


పోలీసు అధికారితో వాగ్వాదానికి దిగుతున్న నాయకులు

దళారులను నమ్మి మోసపోవద్దు


చెక్కు పంపిణీ చేస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట రూరల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందడానికి దళారులను నమ్మి మోసపోవద్దని, అధికారులను సంప్రందించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రజలకు సూచించారు. నర్సంపేట మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం నర్సంపేట, దుగ్గొండి మండలాలకు చెందిన వారికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు సభలో ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్ల పెళ్లి కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థిక సాయం చేస్తుందన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించే పథకాలను పొందడానికి దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎక్కడైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తన దృష్టికి తీసుకురావాలని, వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. దుగ్గొండి మండలానికి చెందిన పలువురికి చెక్కులు రాలేదని ఎమ్మెల్యేకు తెలుపగా అక్కడే ఉన్న తహసీల్దార్ సత్యనారాయణను త్వరగా ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో నర్సంపేట తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్, దుగ్గొండి తహసీల్దార్ సత్యనారాయణ, సిబ్బంది నరేశ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పగోడాల నిర్మాణాలతో జలపాతం కనువిందు


జలపాతం పరిసరాలలో పగోడాలను నిర్మించే ప్రదేశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు మురళి

వాజేడు, న్యూస్‌టుడే: పగోడాల నిర్మాణంతో బొగత జలపాతం పర్యాటకులకు కనువిందు చేయనుందని జయశంకర్ జిల్లా పాలనాధికారి మురళి అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం బొగత జలపాతం సందర్శనకు వచ్చిన సందర్భంగా పర్యాటకుల కోసం పగోడాలను నిర్మించే ప్రదేశాలను అటవీ క్షేత్రాధికారి శంకర్‌తో కలిసి పరిశీలించారు. బొగత జలపాతంలో వరద నీటితో కొట్టుకుపోయిన రాతికట్టను కలెక్టరు పరిశీలించారు. వర్షాలకు వరదనీటి ఉద్ధృతి తీరును గురించి తెలుసుకున్నారు. పగోడాలను నిర్మించాల్సిన ప్రదేశాలను అటవీ క్షేత్రాధికారికి సూచించారు. సందర్శనకు వస్తున్న పర్యాటకులకు ఆహ్లాదం కలిగించే విధంగా జలపాతం పరిసరాలను తీర్చిదిద్దాలని అటవీ క్షేత్రాధికారికి సూచించారు. స్నానాలు చేసేందుకు పర్యాటకులు వరద నీటిలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టరు జలపాతం సందర్శనలో అటవీ క్షేత్రాధికారి శంకర్, అటవీ సిబ్బంది ఉన్నారు.

పదోతరగతి

సాంఘికశాస్త్రం

★ పాఠ్యపుస్తకంలో అభ్యాసాల్లో ఇచ్చిన ప్రశ్నలను ఉన్నవి ఉన్నట్లుగా పబ్లిక్ పరీక్షల్లో ఇవ్వరు. వాటిలో చాలా తక్కువ శాతం ప్రశ్నలు మాత్రమే రావచ్చు. కాబట్టి ఇచ్చిన ప్రశ్నల స్వభావం తెలుసుకుని, జవాబులు రాయాలి.

★ ఒకే ప్రశ్నను వివిధ రూపాల్లో అడిగే అవకాశం ఉంది. జవాబు చదివే సమయంలోనే దానిపై రకరకాల ప్రశ్నలను తయారు చేసి పెట్టుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది.

★ ఏ ప్రశ్నకు ఏ జవాబు రాయాలో, ఎలా రాయాలో తెలుసుకుని వాటిపై పట్టు సాధిస్తే పరీక్షలో ఎలాంటి ప్రశ్నకైనా తేలికగా జవాబు రాయగలుగుతారు.


ప్రతిభ

దేశంలో అత్యంత పొడవైన కాలువ..?

భారతదేశం - భౌగోళిక స్వరూపాలు

ఒక మార్కు ప్రశ్నలు

★ కింది పటాన్ని గమనించి ఇచ్చిన ప్రశ్నకు జవాబివ్వండి.



ప్ర: దక్కన్ పీఠభూమి సరిహద్దులను రాయండి.

జ. ఉత్తరాన: సాత్పురా పర్వతాలు, దక్షిణాన: నీలగిరి పర్వతాలు, తూర్పున: తూర్పు కనుమలు; పశ్చిమాన: పశ్చిమ కనుమలు దక్కన్ పీఠభూమికి సరిహద్దులుగా ఉన్నాయి.

★ కింది పటాన్ని గమనించి ఇచ్చిన ప్రశ్నకు జవాబివ్వండి.

హిమాలయాలు - సమాంతర శ్రేణులు

	హిమాద్రి శ్రేణి	నిమ్న హిమాలయాలు	శివాలిక్ శ్రేణి
ఎత్తు	6100 మీ.	3700–4500 మీ.	900 – 1100 మీ.
ఉనికి	హిమాలయాల్లో అన్నిటి కంటే ఉత్తరాన ఉంది.	హిమాద్రి, శివాలిక్ శ్రేణుల మధ్యలో ఉంది.	అన్నింటి కంటే దక్షిణాన ఉన్న శ్రేణి

ప్ర: హిమాలయాల్లో ఎత్తయిన పర్వత శ్రేణి ఏది? దానికి ఉన్న మరో పేరేమిటి?

జ. 'హిమాద్రి శ్రేణి' హిమాలయాల్లో ఎత్తయిన పర్వత శ్రేణి. దీనికి మరోపేరు 'ఉన్నత హిమాలయాలు.'



రచయిత
బొమ్మిడి నారాయణరావు
విషయ నిపుణులు

ప్ర: దేశంలో అత్యంత పొడవైన కాలువ ఏది? ఇది ఏ రాష్ట్రానికి నీరు అందిస్తుంది?

జ. దేశంలో అత్యంత పొడవైన కాలువ ఇందిరా గాంధీ కాలువ. ఇది ముఖ్యంగా రాజస్థాన్‌కు నీరు అందిస్తుంది.

ప్ర: శివాలిక్ పర్వతాలకు వివిధ ప్రాంతాల్లో ఉన్న పేర్లను తెలపండి.

జ. జమ్మూ ప్రాంతంలో జమ్మూ కొండలనీ, అరుణాచల్ ప్రదేశ్‌లో మిష్మి కొండలనీ, అసోంలో కచార్ అనీ పిలుస్తారు.

ప్ర: డూన్ అంటే ఏమిటి? ఉదాహరణ ఇవ్వండి.

జ. నిమ్న హిమాలయాలు, శివాలిక్ శ్రేణుల మధ్య ఉండే లోయలను స్థానికంగా 'డూన్'లు అంటారు

ఉదా: డెహ్రాడూన్.

ప్ర: 'భారతదేశం ద్వీపకల్పం' అనే పదాన్ని తరచూ ఎందుకు ఉపయోగిస్తారు?

జ. భారతదేశానికి మూడువైపులా నీరు ఉన్న కారణంగా, దక్షిణ భారతదేశాన్ని ఉద్దేశించి 'ద్వీపకల్పం' అనే పదాన్ని తరచూ ఉపయోగిస్తారు.

ప్ర: అండమాన్ నికోబార్ దీవుల్లో అగ్ని పర్వతాల వల్ల ఏర్పడిన దీవులేవి?

జ. నార్కొండం, బారెన్ దీవులు అగ్ని పర్వతాల వల్ల ఏర్పడ్డాయి.

ప్ర: ప్రపంచ పటంలో భారతదేశాన్ని గుర్తించాలంటే ఏయే అక్షాంశ, రేఖాంశాలు మనకు తెలియాలి?

జ. $8^\circ 4' - 37^\circ 6'$ ఉత్తర అక్షాంశాలు, $68^\circ 7' - 97^\circ 25'$ తూర్పు రేఖాంశాలు మనకు తెలిస్తే, ప్రపంచ పటంలో భారతదేశాన్ని సులభంగా గుర్తించవచ్చు.

ప్ర: రెండు నదుల మధ్య ప్రాంతాన్ని ఏమని అంటారు?

జ. రెండు నదుల మధ్య ప్రాంతాన్ని 'అంతర్వేది' అని అంటారు.


ప్ర: గోవా వెళితే మనకు తారసపడే తీర ప్రాంతమేది?

జ. గోవా వెళితే మనకు కొంకణ తీరం తారసపడుతుంది.


ప్ర: పూర్వాంచల్ పర్వతాలు అని వేటిని పిలుస్తారు?

జ. భారతదేశానికి తూర్పు సరిహద్దుగా ఉన్న హిమాలయాలను పూర్వాంచల్ పర్వతాలు అంటారు.

ప్ర: కింది చిత్రంలో పేర్కొన్న పగటి సమయాలను పరిశీలించి, వాటికి సంబంధించిన నగరాలను (ఢిల్లీ, లండన్) గడుల్లో రాయండి.



జ.



నాలుగు మార్కుల ప్రశ్న

ప్ర: 'భారతదేశంలోని మైదాన ప్రాంతాలు వ్యవసాయానికి దోహదపడినంతగా పీఠభూమి ప్రాంతాలు తోడ్పడవు' - ఈ వాక్యాన్ని ఎలా సమర్థిస్తారు?

జ. హిమాలయ నదులైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర వాటి ఉప నదుల వల్ల విశాల ఉత్తర మైదానం ఏర్పడింది. హిమాలయాల నుంచి వచ్చే ఈ నదులు తెచ్చిన రకరకాల ఒండ్రుమట్టి వల్ల ఇది క్రమేపీ పూడుకుంటూ వచ్చింది. అందువల్ల ఇక్కడి నేలలు అధిక భూసారంతో ఉండి, ఎక్కువ దిగుబడిని ఇస్తాయి.

- పీఠభూమి ప్రాంతాలు అగ్నిపర్వత శిలలతో ఏర్పడ్డాయి. ఇవి ఉత్తర మైదాన ప్రాంతాలంత సారవంతమైనవి కావు.
- ఉత్తర మైదాన ప్రాంతంలో ప్రవహించే నదులు జీవ నదులు. ఇవి ఎప్పుడూ నీటితో ఉంటాయి.
- దక్కన్ పీఠభూమి ప్రాంతంలో ప్రవహించే నదులు జీవ నదులు కావు. ఇక్కడ రెండో పంటకు సాగు నీటి కోసం చెరువులు, బోరు బావులపై ఆధారపడవలసి వస్తుంది.
- మైదాన ప్రాంతాల్లో ఉన్న సౌకర్యాలు పీఠభూమి ప్రాంతాల్లో ఉండవు. అందువల్ల 'భారతదేశంలోని ఉత్తర మైదాన ప్రాంతాలు వ్యవసాయానికి దోహదపడినంతగా పీఠభూమి ప్రాంతాలు తోడ్పడవు' అనే వాక్యాన్ని నేను సమర్థిస్తాను.

ముఖ్యమైన ప్రశ్నలు

1) తూర్పు, పశ్చిమ తీర మైదాన ప్రాంతాల మధ్య పోలికలు, తేడాలను రాయండి.
2) హిమాలయాలు భారతదేశానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి?
3) భాబర్, టెరాయిల మధ్య తేడాలను రాయండి.

BANK EXAMS

General Awareness

Sovereign Gold Bonds issued by..



Writer:
A. Veeraswami
Subject Expert

1. Sovereign Gold Bond 2017 – 2018 Series II issued as per the announcement of RBI on 6 July 2017. These bonds issued by RBI on behalf of ....
1) SBI 2) World Bank
3) Muthoot Finance
4) Government of India 5) SEBI

2. The SGB (Sovereign Gold Bond) issued to the buyers on ....
1) 23 July 2) 31 July 3) 1 August
4) 13 July 5) 28 July

3. The RBI sold the SGB to buyers through .....
1) banks 2) designated Post Offices
3) recognized Stock Exchanges
4) Stock Holding Corporation of India Limited (SHCIL) 5) All of above

4. The person / entity eligible to buy SGB Bonds is / are ....
1) Individuals 2) HUFs 3) Trusts
4) Universities and Charitable Institutions
5) All of above

5. SGB will be denominated in multiples of gram(s) of gold with a basic unit of ....
1) 3 grams 2) 8 grams 3) 10 grams
4) 1 gram 5) 12 grams

6. Under the Sovereign Gold Bond 2017 - 18 Series II, instead of buying physical gold, Indian residents can buy the Gold Bonds. These Bonds would be issued for the term of 8 years with exit option from ....
1) 5th year 2) 1st year 3) 4th year
4) 2nd year 5) 3rd year

7. Maximum amount of gold that can be subscribed by person / HUF per fiscal year under SGB scheme as announced on 26 July 2017 is ....
1) 100 gms 2) 1000 gms 3) 4000 gms
4) 2000 gms 5) 250 gms

8. Maximum amount of gold that can subscribe by trust and similar entities in SGB scheme as per the notification given by the government is ....
1) 50 kgs 2) 80 kgs 3) 20 kgs
4) 40 kgs 5) 30 kgs

9. Wrong statement regarding SGB (Sovereign Gold Bond) scheme is ....
1) Bonds are eligible for conversion into DEMAT form
2) Bonds will be tradable on stock exchanges
3) the interest accrued on Gold Bonds shall not be taxable under Income Tax Act,1961
4) Capital gains tax arising on redemption of SGB to an individual has been exempted
5) KYC (Know Your Customer) compulsory to buy

10. Under the Sovereign Gold Bonds 2017-18 Series Scheme, investors earn interest rate up to .... payable semi-annually on the initial value of investment.
1) 2.50 % per annum 2) 1.50 % per annum
3) 8.50 % per annum 4) 4.50 % per annum
5) 7.50 % per annum

11. SGB can be used as collateral for loans and for this purpose LTV ratio is to be set equal to ordinary gold loan mandated by the RBI from time to time. In this context, LTV stands for ....
1) LIBOR-to-value 2) linked-to-value
3) liability-to-value 4) loan-to-value
5) locker rent-to-value

12. On 6 July 2017, RBI released Compendium of Guidelines for Small Finance Banks - Financial Inclusion and Development. As per it, Small Finance Banks required to open at least .... of its branches in unbanked rural centers
1) 5% 2) 40% 3) 50% 4) 15% 5) 25%

13. Small Finance Banks required to extend 75% of its ANBC to priority sector. In this context, ANBC stands for ....
1)Average Net Bank Credit
2)Adjusted Net Batch Credit
3) Adjusted Nil Bank Credit
4) Adjusted Net Bank Credit
5) Allotment Net Bank Credit

14. Total Agricultural advances must be .... of ANBC given by Small Finance Banks
1) 24% 2) 60% 3) 15% 4) 32% 5) 18%

15. Within the 18 percent target for Agriculture, a target of .... of ANBC is prescribed for Small and Marginal Farmers by Small Banks.
1) 4% 2) 6% 3) 8% 4) 2% 5) 1%

16. Advances to weaker sections is the part of Priority Sector holding. What percentage of ANBC must be given to weaker section people by the Small Finance Banks (SFB)?
1)10% 2) 20% 3) 25% 4) 15% 5) 12%

17. A target of .... percent of ANBC must be given to micro enterprises as part of Priority Sector Lending by SFBs.
1) 7.5% 2) 10.5%
3) 6.8% 4) 8.2% 5)10.5%

18. Operating Guidelines for Small Finance banks issued by RBI on 6 October 2016. The guidelines for Licensing of Small Finance Banks earlier passed by RBI on...
1) 1 June 2016 2) 26 February 2016
3) 1 February 2014 4) 21 December 2015
5) 27 November 2014

19. Minimum Capital Requirement for Small Finance Banks is .... as per the guide lines issued on 6 October 2016.
1) 9% 2) 10% 3) 15% 4) 21% 5) 11.5%

20. Tier 1 common capital ratio is a measurement of a bank's core equity capital compared with its total risk-weighted assets that signifies a bank's financial strength. As per operating guidelines, for Small Finance Banks, the Common Equity Tier 1 is .... ?
1) 7% 2) 8.5% 3) 10% 4) 9.8% 5) 6%

21. The Minimum paid-up equity capital for small finance banks shall be.....?
1) Rs.1,000 crore
2) Rs.5,000 crore 3) Rs.500 crore
4) Rs.10 crore 5) Rs.100 crore

Key

1-4	6-1	11-4	16-1	21-5.
2-5	7-3	12-5	17-1	
3-5	8-3	13-4	18-5	
4-5	9-3	14-5	19-3	
5-4	10-1	15-3	20-5	

ఉద్యోగాలు Jobs



ముఖ్యమైన తేదీలు

★ హార్టిసెట్ - 2017కు దరఖాస్తు చేయడానికి: 31 ఆగస్టు
★ ఇస్రోలో అప్రెంటిస్ ఖాళీలకు దరఖాస్తు చేయడానికి: 2 సెప్టెంబరు
★ దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డులోని ఖాళీలకు: 15 సెప్టెంబరు
★ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేయడానికి: 4 సెప్టెంబరు

ప్రతిభ

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్

బెంగళూరులోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ టెక్నికల్ అప్రెంటిసెస్ (డిప్లొమా హోల్డర్లు) పోస్టుల భర్తీకి వాక్- ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనుంది.
- ఖాళీలు: టెక్నీషియన్ అప్రెంటిసెస్ - 310.
- వ్యవధి: ఏడాది.
- విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్/ మెకానికల్ ఇంజినీరింగ్/ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్/ సివిల్ ఇంజినీరింగ్/ మెకానికల్ ఇంజినీరింగ్.
- అర్హత: సంబంధిత విభాగంలో (2015 తర్వాత) డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 1 ఆగస్టు 2017 నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల వయోపరిమితిలో మినహాయింపు లభిస్తుంది.
- స్టయిపెండ్: నెలకు రూ.4000 చెల్లిస్తారు.
- ఎంపిక: 21 ఆగస్టు నుంచి 31 ఆగస్టు వరకు నిర్వహించే ఇంటర్వ్యూల ఆధారంగా.
- ఇంటర్వ్యూ వేదిక: భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ డివిజన్, మైసూరు రోడ్, బెంగళూరు - 560026.
- అర్హులైన అభ్యర్థులు పూర్తి వివరాలతో ఇంటర్వ్యూకి హాజరుకావొచ్చు.

చివరి తేదీ: *31 ఆగస్టు*
వెబ్‌సైట్: **www.bheledn.com**

ఇస్రోలో ఖాళీలు

మహేంద్రగిరి (తమిళనాడు)లో ఇస్రోకి చెందిన ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ ట్రేడ్ అండ్ టెక్నీషియన్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- మొత్తం ఖాళీలు: 139 (ట్రేడ్ అప్రెంటిస్ - 80, టెక్నీషియన్ అప్రెంటిస్ - 59)
- అర్హత: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్/ బ్రాంచ్‌లో ఐటీఐ/ ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 35 ఏళ్లకు మించకూడదు.
- ఎంపిక: అకడెమిక్ మెరిట్ ఆధారంగా.
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో సూచించిన నమూనాలో పూర్తి వివరాలు జత చేసి పంపాలి.
- చిరునామా: ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ), మహేంద్రగిరి, తిరునల్వేలి జిల్లా, తమిళనాడు

✦ చివరి తేదీ: *2 సెప్టెంబరు*
✦ వెబ్‌సైట్: **www.iprc.gov.in**

ఐఐటీ, మద్రాస్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- మొత్తం ఖాళీలు: 32.
- రిజిస్ట్రార్ - 1.
- సిస్టమ్స్ ఇంజినీర్ - 1.
- సెక్యూరిటీ ఆఫీసర్ - 1.
- జూనియర్ ఇంజినీర్ - 3.
- స్టాఫ్ నర్స్ - 4
- జూనియర్ టెక్నీషియన్ - 12.
- జూనియర్ అసిస్టెంట్ - 10.
- దరఖాస్తు: ఆన్‌లైన్ దరఖాస్తులు 8 సెప్టెంబరు వరకు అందుబాటులో ఉంటాయి.
- పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: 15 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.iitm.ac.in**

మరింత విద్యా ఉద్యోగ సమాచారం కోసం చూడండి..
www.eenadupratibha.net

ఇస్రోలో అప్రెంటీస్‌లు...

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు పలు విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- మొత్తం ఖాళీలు: 15116
- జూనియర్ ఇంజినీర్ (సివిల్ - 70, మెకానికల్ - 15)
- పట్వారీ - 140
- లీగల్ అసిస్టెంట్ - 13
- స్పెషల్ ఎడ్యుకేటర్ - 1540
- ప్రైమరీ టీచర్ - 4366
- స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ - 496
- అసిస్టెంట్ టీచర్ (నర్సరీ - 320, ప్రైమరీ - 1394)
- ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ - 919
- డ్రాయింగ్ టీచర్ - 295
- డొమెస్టిక్ సైన్స్ టీచర్ - 199
- పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ): హోమ్‌సైన్స్ - 114, ఫిజికల్ ఎడ్యుకేషన్ - 160, ఫైన్ ఆర్ట్ - 30, మ్యూజిక్ - 1, బయాలజీ - 15, కెమిస్ట్రీ - 21, కామర్స్ - 28, ఎకనామిక్స్ - 32, ఇంగ్లిష్ - 156, హిందీ - 179, హిస్టరీ - 205, పొలిటికల్ సైన్స్ - 203, సంస్కృతం - 48, జాగ్రఫీ - 69, మ్యాథ్స్ - 20, ఫిజిక్స్ - 18, పంజాబీ - 3, ఉర్దూ - 2, అగ్రికల్చర్ - 1, సోషియాలజీ - 83.
- ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ): ఇంగ్లిష్ - 678, మ్యాథ్స్ - 610, నేచురల్ సైన్స్ - 416, సోషల్ సైన్స్ - 603, బెంగాలీ - 1, హిందీ - 422, పంజాబీ - 214, సంస్కృతం - 254, ఉర్దూ - 213.
- ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ గైడెన్స్ కౌన్సెలర్ - 432
- మ్యూజిక్ టీచర్ - 46
- దరఖాస్తు: 25 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
- ఎంపిక: రాతపరీక్ష (టైర్ - 1, టైర్ - 2) ఆధారంగా.

✦ చివరి తేదీ: **15 సెప్టెంబరు**
వెబ్‌సైట్: **dsssonline.nic.in**

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ఖాళీలు: రిస్క్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్స్ - 7 (క్రెడిట్ రిస్క్ - 3, ఆపరేషనల్ రిస్క్ - 2, మార్కెట్ రిస్క్ - 2)
- అర్హత: ఏదైనా డిగ్రీతోపాటు ఎంబీఏ/ సీఏ/ ఐసీడబ్ల్యూఏ
- వయసు: 30 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి.
- **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కింది పోస్టులను కూడా భర్తీ చేయనుంది.**
- చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) - 1. సీఏ ఉత్తీర్ణతతోపాటు 15 ఏళ్ల అనుభవం అవసరం.
- చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీవో) - 1. ఇంజినీరింగ్ డిగ్రీ లేదా ఎంసీఏ ఉత్తీర్ణులైనవారు అర్హులు. అనుభవం ఉండాలి.
- ప్రిన్సిపల్ - స్టాఫ్ ట్రెయినింగ్ కాలేజ్ - 1. ఎకనామిక్స్/ కామర్స్‌లో పీజీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంబీఏ (ఫైనాన్స్)/ పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం లభిస్తుంది.
- దరఖాస్తు: ఆన్‌లైన్ దరఖాస్తులు 2 సెప్టెంబరు వరకు అందుబాటులో ఉంటాయి.
- ఎంపిక: రాతపరీక్ష/ పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: 12 సెప్టెంబరు
- చిరునామా: ది అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఐఆర్ అండ్ హెచ్ఆర్‌డీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లోక్‌మంగల్, 1501, శివాజీ నగర్, పుణె - 411 005

✦ వెబ్‌సైట్: **www.bankofmaharashtra.in**

టీచింగ్ పోస్టులు

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- మొత్తం ఖాళీలు: 16
- టీచింగ్ - 9. ప్రొఫెసర్ - 1, అసోసియేట్ ప్రొఫెసర్ - 3, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 5

అర్హత: 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీతోపాటు పీహెచ్‌డీ, బోధన/ రిసెర్చ్‌లో అనుభవం అవసరం.

నాన్ టీచింగ్ పోస్టులు: 7
- సైకియాట్రిక్ సోషల్ వర్కర్ - 1, డేటా ఎంట్రీ ఆపరేటర్ - 1, స్టెనోగ్రాఫర్ - 5.
- ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

✦ చివరి తేదీ: ***31 ఆగస్టు***
వెబ్‌సైట్: **www.tiss.edu**

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ఖాళీలు: 36
- మేనేజ్‌మెంట్ ట్రెయినీ (హెచ్ఆర్) - 12. అర్హత: 60 శాతం మార్కులతో ఎంబీఏ/ పీజీ డిగ్రీ లేదా పర్సనల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/ హెచ్ఆర్ లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- మేనేజ్‌మెంట్ ట్రెయినీ (మార్కెటింగ్) - 24. అర్హత: 60 శాతం మార్కులతో ఎంఎస్సీ (అగ్రికల్చర్) లేదా తత్సమాన అర్హత అవసరం. లేదా మార్కెటింగ్/ అగ్రి బిజినెస్ మార్కెటింగ్/ ఇంటర్నేషనల్ మార్కెటింగ్/ రూరల్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ/ పీడీజీబీఎం ఉత్తీర్ణులై ఉండాలి.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.
- ఎంపిక: ఆన్‌లైన్ రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.

✦ చివరి తేదీ: **6 సెప్టెంబరు**
వెబ్‌సైట్: **www.nationalfertilizers.com**


అసిస్టెంట్ ప్రొఫెసర్లు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 224 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- అగ్రికల్చర్ - 186 (6 లైబ్రరీ సైన్స్ పోస్టులతో కలిపి).

అర్హత: అగ్రికల్చరల్ ఎకనామిక్స్/ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్/ అగ్రికల్చరల్ మైక్రోబయాలజీ/ ఆగ్రోనమీ/ క్రాప్ ఫిజియాలజీ/ ఎంటమాలజీ/ జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్/ హార్టికల్చర్/ ప్లాంట్ పాథాలజీ/ ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ/ సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీ/ స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమెటిక్స్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ, కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)లో అర్హత సాధించి ఉండాలి.

లైబ్రరీ సైన్స్ పోస్టులకు లైబ్రరీ సైన్స్/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ డాక్యుమెంటేషన్ సైన్స్‌లో 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత అవసరం.
- అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ - 22, హోమ్‌సైన్స్ - 16.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో 20 సెప్టెంబరు వరకు.

✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: **29 సెప్టెంబరు**
- **హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ బ్యాక్‌లాగ్ (ఎస్సీ, ఎస్టీ) పోస్టులను కూడా భర్తీ చేయనుంది.**
- ఖాళీలు: అగ్రికల్చర్ - 10, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ - 5, హోమ్ సైన్స్ - 3
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో 12 సెప్టెంబరు వరకు.



✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: ***29 సెప్టెంబరు***
వెబ్‌సైట్: **www.pjtsau.ac.in**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ఖాళీలు: అసిస్టెంట్ ప్రొఫెసర్లు (బ్యాక్‌లాగ్ - 178, రెగ్యులర్ - 20)
- విభాగాలు: అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్.
- అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, ఎండీఎస్, డీఎం, ఎంసీహెచ్, డీఎన్‌బీ, పీహెచ్‌డీ లేదా తత్సమాన అర్హత అవసరం.
- వయోపరిమితి: 1 జులై 2017 నాటికి 40 సంవత్సరాలకు మించకూడదు.
- దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

✦ చివరి తేదీ: ***4 సెప్టెంబరు***
వెబ్‌సైట్: **dme.ap.nic.in**

ప్రవేశాలు

హార్టిసెట్ - 2017

హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చరల్ యూనివర్సిటీ 2017 - 18 విద్యాసంవత్సరానికి బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో ప్రవేశానికి నిర్వహించే 'హార్టిసెట్ - 2017' కు నోటిఫికేషన్ విడుదల చేసింది.
- సీట్ల సంఖ్య: 23.
- అర్హత: హార్టికల్చర్ డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 31 డిసెంబరు 2017 నాటికి 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్నవారై ఉండాలి.
- దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- పూర్తి చేసిన దరఖాస్తుకు కంప్ట్రోలర్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, రాజేంద్రనగర్, హైదరాబాద్ పేరిట చెల్లేలా తీసిన రూ.750 డీడీ (ఎస్సీ/ ఎస్టీ/ పీహెచ్ అభ్యర్థులు రూ.350) జత చేసి పంపాలి.
- పరీక్ష తేదీ: 18 సెప్టెంబరు

✦ చివరి తేదీ: 31 ఆగస్టు
వెబ్‌సైట్: **www.skltshu.ac.in**

హాయ్! బుజ్జీ!!

అందం చూసే కళ్లలో ఉండదు, సాయం చేసే చేతుల్లో ఉంటుంది

- అబ్దుల్ కలాం

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Protection = రక్షణ
- మనోజ్ఞం = అందం

నవ్వుల జల్లులు!

టీచర్: కళ్లు, ముక్కు, చెవులు ఎందుకు ఉపయోగపడతాయి?

బిట్టు: కళ్లద్దాలు పెట్టుకోవడానికి టీచర్!


- **జి. వెంకట రమణ,** తూర్పునాయుడుపాలెం

టీచర్: రామూ! పిల్లుల జాతికి చెందిన జంతువుల పేర్లు చెప్పు?

రాము: తల్లి పిల్లి, తండ్రి పిల్లి, పిల్లి పిల్లలు టీచర్!

- **పి. నారాయణ,** అనంతపురం

2034లో మీ దగ్గరా చూడొచ్చు!



◆ హాయ్... సూర్యుడు గారూ! నాపేరు కిట్టూ! హాయ్‌బుజ్జీ తరఫున మిమ్మల్ని సరదాగా పలకరిద్దామని వచ్చా. 'నా గురించి తెలియనిదేముందబ్బా?' అనుకుంటున్నారేమో కానీ మరేమీ లేదు.. రెండు మూడు రోజులుగా అంతా మీ సంగతులే మాట్లాడుతున్నారు... అమెరికాలో, ప్రసార మాధ్యమాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం అంటూ హల్‌చల్ నడిచింది. అవునుగానీ ఇంతకీ మీరు మా దగ్గర ఇలా ఎప్పుడు కనిపిస్తారేంటి?

▶▶ నన్ను కలవడానికి వచ్చినందుకు చాలా సంతోషం కిట్టూ. మీ దగ్గర నా సంపూర్ణ సూర్యగ్రహణం చూడాలంటే 2034 వరకు ఆగాల్సిందే. లేదంటే 2019లో దక్షిణ అమెరికా దేశాల దగ్గర కనిపిస్తానిలా. అప్పటిలోగా నా గ్రహణం గురించి మీ శాస్త్రవేత్తలేమైనా కొత్త విషయాలు తెలుసుకుంటారేమో చూద్దాం.

◆ అవును నాకూ ఉత్సాహంగానే ఉంది. అది సరే... మరి ఇప్పటి సూర్యగ్రహణం సంగతులు ఏంటి?

▶▶ ఆ విషయానికే వస్తున్నా. కానీ ఇంకాస్త దూరంగా నిలబడు! లేదంటే నా వేడిని తట్టుకోలేవు. భూమికీ, నాకూ మధ్య చంద్రుడు వచ్చినప్పుడు, మీ భూమిపై కొంత భాగంలో నేను కనిపించను. దాన్నే సూర్యగ్రహణం అంటారని వినే ఉంటావుగా. అత్యంత ప్రకాశవంతంగా వెలిగే నేను చంద్రుడి ఛాయ వల్ల ఒక సన్నటి అంచులా కనిపిస్తా. అప్పుడు ఆ ప్రదేశంలో మాత్రం సూర్యగ్రహణం కనిపిస్తుంది. ఇప్పుడు అమెరికాలో జరిగింది అచ్చంగా ఇదేనన్నమాట.

◆ అయితే ఈసారి వచ్చిన సంపూర్ణ గ్రహణం దాదాపు 99 ఏళ్ల తర్వాత ఏర్పడిందటగా. పసిఫిక్ తీర ప్రాంతం నుంచి అట్లాంటిక్ తీరం వరకు మీ గ్రహణం వల్ల చీకటి పడటం చాలా అరుదైన విషయమంటూ మా శాస్త్రవేత్తలూ చెబుతున్నారు. ఎప్పుడో 1918లో ఇలాంటి గ్రహణం కనిపించిందట. మళ్లీ ఇన్నాళ్లకు ఇలా. అందుకే దీనికి 'గ్రేట్ అమెరికన్ ఎక్లిప్స్' అంటూ పేరూ పెట్టేశారు.

▶▶ అవును కిట్టూ. అమెరికా ఒరెగాన్ నుంచి దక్షిణ కరోలినా వరకు 14 రాష్ట్రాల మీదుగా 98 కిలోమీటర్ల నుంచి 113 కిలోమీటర్ల మేర నాకు చంద్రుడు అడ్డొచ్చాడు. ఈ తతంగమంతా 2 గంటల 40 నిమిషాల పాటు జరిగింది. అందుకే ఆ ప్రాంతమంతా పట్టపగలే రెండు మూడు నిమిషాలు చీకటయ్యింది. అప్పుడు నా గ్రహణాన్ని చూడ్డానికి భారీ ఏర్పాట్లే జరిగాయనుకుంటా!

◆ అవునవును. సోమవారం అమెరికాలో అన్ని చోట్లా ఒకటే సందడి. అమెరికాలో కొన్ని చోట్ల పాక్షికంగా కనిపిస్తే కొన్ని రాష్ట్రాల్లో మాత్రం సంపూర్ణంగా గ్రహణం కనిపించింది. నేను నేరుగా చూడలేదు కానీ నాసా వాళ్లు అందించిన ప్రత్యేక ప్రసారాల్లో చూశా. విద్యార్థులకు అంతరిక్షం విషయాలు పుస్తకాల్లోనే తప్ప నిజంగా చూపించడానికి కుదరదు కదా. కానీ ఈ సందర్భంగా ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌ఫార్మల్ స్టెమ్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ లాంటివి పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. కళ్లకు హాని జరగకుండా ఉండేందుకు కళ్లజోళ్లు ఇచ్చి నేరుగా సూర్యగ్రహణాన్ని దగ్గరుండి చూపించాయి. కొన్ని మ్యూజియాల్లో వారి కోసం గ్రహణంపై తరగతులు నిర్వహించాయి. టెలిస్కోపులిచ్చి, దాంట్లోంచి గ్రహణాన్ని చూపిస్తూ వివరాలు చెప్పుకొచ్చాయి. ఇదంతా భలేగా సాగిపోయింది.

▶▶ శాస్త్రవేత్తలు కూడా చాలా ఆసక్తి చూపినట్టున్నారే!

◆ అవును మరి. అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం నాసా వారైతే మరీనూ. ఏదో రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్ పెట్టినట్లు మీ గ్రహణానికీ పెట్టి ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇక చాలామంది శాస్త్రవేత్తలైతే ఆ సమయంలో మిమ్మల్నీ, చంద్రుడినీ టెలిస్కోపుల ద్వారా ఎంతో పరీక్షగా చూశారు. దాన్నుంచి వాళ్లు నేర్చుకునే విషయాలు మీపై చేసే పరిశోధనల్లో ఎంతో ఉపయోగపడతాయని చెబుతున్నారు వాళ్లు.

మరో విషయం చెప్పడం మరిచా. మీ గ్రహణాన్ని నేల మీద నుంచే కాదు. విమానాల్లోంచి, సముద్రంలో ఓడల మీద నుంచి కూడా చూశారు కొంత మంది. ఇక వస్తా సూర్యుడు గారూ! ఈ కబుర్లన్నీ మా వాళ్లకీ చెప్పాలి కదా!

▶▶ సరే కిట్టూ. బైబై మరి!

ప్రశ్నలోనే సమాధానం!

ఇక్కడున్న ఆంగ్ల పదాల్లోనే దాని పక్కనున్న తెలుగు పదాల సమానార్థకాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టండి.

1. Boxలో ఎద్దు ☐☐
2. Beatలో తిను ☐☐☐
3. Teamలో తేనీరు ☐☐☐
4. Stageలో వయసు ☐☐☐
5. Priceలో మంచు ☐☐☐
6. Partలో కళ ☐☐☐
7. Phoneలో ఒకటి ☐☐☐
8. Earthలో చెవి ☐☐☐

- **ఎస్. మణెమ్మ,** కాజీపేట

చుక్కలు కలపండి



చిలిపి ప్రశ్న

నూతిలో ఉన్న పది కప్పల్లో తొమ్మిది చచ్చిపోతే ఇంక ఎన్ని ఉంటాయి?

- **జి. రమేష్,** పెనుబర్తి

పట్టికలో పదాలు

P	F	I	E	S	P	D	T	B	N	L	P
C	E	T	U	J	T	H	R	I	I	N	Q
J	K	N	A	R	D	H	A	E	B	H	J
H	E	F	M	S	A	T	U	R	N	B	I
V	I	M	M	L	F	N	E	M	A	U	I
Y	G	F	E	N	O	T	U	H	N	Z	K
U	I	I	R	E	I	W	T	S	P	M	G
M	S	Q	C	P	H	C	R	W	M	E	F
A	P	L	U	T	O	A	M	S	E	L	A
S	O	J	R	U	M	M	D	E	A	R	M
D	I	A	Y	N	R	X	H	G	M	D	X
R	E	E	P	E	O	F	B	N	H	O	O

ఇక్కడి పదాలు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి

MERCURY, VENUS, EARTH, MARS, JUPITER, SATURN, URANUS, NEPTUNE

బొమ్మలో ఉన్నవే



బొమ్మలో X ఆంగ్ల అక్షరంతో మొదలయ్యే అంశాలున్నాయి. అవేంటో పట్టుకుని గడుల్లో రాయగలరా?

X ☐☐☐☐☐ / ☐☐☐☐☐☐☐ / ☐☐☐ / ☐☐☐☐ / ☐☐☐☐☐☐☐

జవాబులు: బొమ్మలో ఉన్నవే: Xantus, Xerus, Xray, Xiphias, X ray fish చిలిపి ప్రశ్న: పదీ అందులోనే ఉంటాయి! ప్రశ్నలోనే సమాధానం: 1. Ox 2. Eat 3. Tea 4. Age 5. Ice 6. Art 7. One 8. Ear

వరంగల్‌లో సెప్టెంబర్ 10న రజక వధూవరుల వివాహ పరిచయ వేదిక

రజక కమ్యూనిటీలో సంబంధాలను అన్వేషించే వారి సౌకర్యార్థం ఈనాడు పెళ్లిపందిరి.నెట్ వరంగల్‌లో సెప్టెంబర్ 10న పరిచయవేదిక నిర్వహిస్తుంది.

వేదిక : హోటల్ వైష్ణవి గ్రాండ్, ఫాతిమా కాంప్లెక్స్, ఫాతిమానగర్, ఖాజీపేట్, వరంగల్.

ప్రత్యేకతలివీ.....

వధువు/వరుడు, వారి ఇష్టాఇష్టాల పరిచయం.

వధువు/వరుడు వివరాలతో కూడిన సి.డి. ఇవ్వబడును.

ఈనాడు పెళ్లిపందిరి.నెట్ వెబ్‌సైట్ ద్వారా మీకు నచ్చిన 10 'కాంటాక్ట్ నంబర్స్' 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి ఉచితంగా చూసుకునే అవకాశం.

ఈనాడు పెళ్లిపందిరి.నెట్ ద్వారా వివాహం జరిగిన వారు 3 నెలల లోపు తెలియచేస్తే రూ॥ 2500/- విలువ గల గిఫ్ట్ కూపన్ అందచేయబడును.

పరిచయవేదికకు వచ్చిన వధువు/వరుడుతో కలిపి ముగ్గురు వ్యక్తులకు భోజన వసతి.

రిజిస్ట్రేషన్ల సంఖ్య పరిమితం. రుసుము రూ॥ 2100/-.

రిజిస్ట్రేషన్ కొరకు వచ్చునపుడు వధువు/వరుడుల ఐ.డి. ప్రూఫ్ (ఆధార్ కార్డ్/పాస్‌పోర్ట్/డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ కార్డ్) తీసుకురావాలి.

ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొనేవారికి 10% తగ్గింపు కలదు. 10% తగ్గింపు పొందుటకు ఆఖరు తేది : 31-08-2017.

మరిన్ని వివరాలకు సంప్రదించండి : ఈనాడు ఆఫీస్, ఇంటి నెం. 1-8-205, బాలసముద్రం స్విమ్మింగ్ పూల్ దగ్గర, హన్మకొండ, వరంగల్. ఫోన్స్ : 8008550132, కరీంనగర్ : 8008551132, నిజామాబాద్ : 8008551131, ఖమ్మం : 8008550131, మహబూబ్‌నగర్ : 8008551130, సూర్యాపేట్ : 9177147543, హైదరాబాద్ : 9100058123..

వరుడు లేదా వధువులకు సంబంధించిన కార్డ్ సైజ్ ఫోటో తప్పక వెంట తీసుకురావాలి. నిరంతరం ప్రత్యక్ష సేవలు మరియు సమాచారం కోరువారికి నిర్ణీత రుసుముతో ప్యాకేజిలు కూడా లభ్యమవుతాయి.

రిజిస్ట్రేషన్స్ ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చు. www.eenadupellipandiri.net

మార్కెట్ ఎదుట రైతుల ఆందోళన

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సరకులు విక్రయించి మోసపోయిన రైతులు నగదు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో మార్కెట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు గుగులోతు దస్రూనాయక్ మాట్లాడుతూ కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సరకులు ఖరీదు చేసి ఇద్దరు పారిపోయిన సంఘటనలో నేటికీ పూర్తిగా రైతులకు నగదు చెల్లించలేదన్నారు. కొంత మంది రైతులకు మాత్రమే నగదు చెల్లించి మార్కెట్ కమిటీ చేతులు దులుపుకొందన్నారు. నగదు కోసం రైతులు మార్కెట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారే లేరని ఆరోపించారు. మార్కెట్‌లో సరకులు విక్రయించి మోసపోయిన ప్రతి రైతు నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరోసారి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. చివరకు మార్కెట్ అధికారులు మాట్లాడుతూ ఈనెల 26న సమావేశం నిర్వహించి త్వరలో సమస్య పరిష్కరించనున్నట్లు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో అఖిల పక్ష నేతలు తోట భిక్షపతి, కంచ వెంకన్న, శివారపు శ్రీధర్, మంద భాస్కర్, సోమారపు మదార్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు

హరితహారం విజయవంతం చేయాలి

మహబూబాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: వచ్చే నెల 15 నాటికి హరితహారం విజయవంతం చేయాలని వీసీలో రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రజత్‌కుమార్ కలెక్టర్లను ఆదేశించారు. ఆయన హైదరాబాద్ నుంచి వీసిలో కలెక్టర్ ప్రీతిమీనతో మాట్లాడారు. మూడో విడత హరితహారం కార్యక్రమంలో సమన్వయంతో ముందుకెళ్లాలని కోరారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యం చేరుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటిదాకా 10 లక్షల మొక్కలకు జియోట్యాగింగ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో కిష్టగౌడ్, గణేశ్ తదితులు పాల్గొన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: వ్యాపారాభివృద్ధికి బుధవారం గణపతిని ఎలా పూజించాలి?, చిత్రపటాలు అదృష్టాన్నిస్తాయా?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: సామాన్యుడు (జగపతిబాబు, కామ్నజెత్మాలని).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': మసాలా వంటలు 'చికెన్ మంచూరియా', 'కీమా ఫ్రై', కారం కారంగా 'క్రాబ్స్ పెప్పర్ ఫ్రై', చెఫ్స్ స్పెషల్ 'ప్రాన్స్ పకోడీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి–2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సాటైం (రిపీట్), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఢీ 10: సూపర్ డాన్సుల సుప్రీమ్ షో...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 మహాతల్లి రిపీట్

01:15 ఫ్రూట్స్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 పోవే..పోరా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 నా షో నా ఇష్టం

09:00 పటాస్

09:30 అల్లరే అల్లరి

10:00 సరదాగా కాసేపు

10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)

★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)

★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)

★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)

★ అమృతం (ఉ.8:00, మ.12:30, రా.8:00)

★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా.8:30)

★ ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ.3:00, రా.09:00)

★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (ఉ.9:30, సా.4:00)

★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (ఉ.10:00)

★ విహారి (మ.12:00, సా.6:30, రా.10:00)

★ హెల్దీ డయాబెటిక్ (మ.1:30)

★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (మ.2:00, రా.7:00)

★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (మ.2:30, రా.09:30).

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: జీవనజ్యోతి (జయసుధ), 10-00: మార్నింగ్ షో: భార్యాభర్తల బంధం (బాలకృష్ణ, రజని), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: మువ్వగోపాలుడు (బాలకృష్ణ, విజయశాంతి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: జనం (సాయికుమార్), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దలు మారాలి (కృష్ణ, జమున), 10-00 సెకండ్ షో: అగస్టు 15 రాత్రి (అర్జున్, గౌతమి).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ శాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ బేసిల్ క్రేప్స్ & సొరకాయ తెలగపిండి రైస్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – వెన్న చెక్కలు & మొక్కజొన్న బూరెలు, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – టమోట కోకోనట్ సూప్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (వృద్ధ వయసు వారికోసం) – క్యాబేజి చట్నీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - వంకాయ పప్పు & వంకాయ రోటి పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - పటిస్టప (బెంగాలీ క్యుసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఆలూ పన్నీర్ బైట్స్, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - దొండకాయ చట్నీ అవకాడొ చపాతీ రోల్, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - బట్టర్ గార్లిక్ పెప్పర్ ప్రాన్స్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (జపాన్ స్పెషల్) – జపనీస్ ఫిష్ సూప్ & ప్రాన్స్ అండ్ ఫిష్ క్యాబేజి, మ.1.30, రా.10.00: చటపట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - స్ప్రౌట్స్ గోకరకాయ కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – చాక్లెట్ కప్ కేక్స్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – సెజ్వాన్ చిల్లీ నూడుల్స్, మ.2.30: చోటా షెఫ్ – చికెన్ విత్ ఎగ్ ఫ్రై, మ.3.00: పదండి విందుకు – ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.5.15: స్నాక్స్ - బ్రెడ్ దహీ వడ.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ పద్మనాభ స్వామి ఆలయం, పద్మనాభం, విశాఖపట్నం, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి(రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30తీర్థయాత్ర: శ్రీహరిహరక్షేత్రం, కర్మన్‌ఘాట్, హైదరాబాద్, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీ భవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

అధిక వర్షాలు - పైర్లలో జాగ్రత్తలు

రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా వివిధ పంటల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, అపరాల పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఖమ్మం ఏరువాక సెంటర్ సమన్వయకర్త డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

పత్తి పంటలో... : ★ సాధ్యమైనంత వరకు చేలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు నీటిని మురుగు కాల్వలు ఏర్పాటు చేసుకొని తీసివేయాలి.

★ వర్షాలు తగ్గిన వెంటనే భూమిలో తేమను తగ్గించుకోటానికి అంతర సేద్యం చేయాలి. ★ అంతర సేద్యం చాలా రోజుల వరకు వీలుకాకపోతే కలుపు సమస్య ఎక్కువగా ఉంటే విత్తిన 45-60 రోజుల పైరులో ఎకరాకు 400 మి.లీ. క్విజలోపాప్ ఇథైల్ + పైరిథయోబాక్ సోడియం 250 మి.లీ. కలిపి పిచికారీ చేసి కలుపును నివారించుకోవాలి.



★ వర్షాలు తగ్గిన వెంటనే బురద పదునులో ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి. విత్తేటప్పుడు భాస్వరం వేయని రైతులు ఎకరానికి 50 కిలోల డీఏపీని విత్తిన 20-25 రోజుల సమయంలో వేసుకోవాలి. ★ అధిక వర్షాలకు వేరుకుళ్లు తెగులు ఆశిస్తే 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి, మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలి.

మొక్కజొన్నలో...: ★ మొక్కజొన్న అధిక తేమను తట్టుకోలేదు. సాధ్యమైనంత త్వరగా అంతరకృషి చేయటం ద్వారా తేమను తగ్గించుకోవాలి. ★ చేలో నిల్వ వర్షపు నీటిని కాల్వలు బోదెల ద్వారా ఎప్పటికప్పుడు తీసివేయాలి. ★ తేమ ఎక్కువగా ఉన్న మొక్కజొన్న పొలంలో ఎకరాకు 25 కిలోల యూరియా + 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కల మొదళ్ల దగ్గర వేసుకుంటే కొంతవరకు తేమ ఒత్తిడిని తట్టుకుంటుంది. ★ మొక్కజొన్నలో అంతరకృషి ఆలస్యమైతే, కలుపు నివారణకు టిమ్‌బొట్రియాన్(లాడిన్) కలుపు మందును ఎకరాకు 115 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

అపరాలు, మిరపలో...: ★ పెసర, మినుము పైర్లలో పేనుబంక, లద్దెపురుగు ఆశించే అవకాశం ఉన్నందున, ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ★ 20-25 రోజుల దశలో ఉన్న పెసర, మినుము పైర్లలో కలుపు అధికంగా ఉంటే.. అంతరసేద్యం వీలుకానప్పుడు ఇమజిథాపిర్ అనే కలుపు మందును 200 లీటర్ల నీటిలో 200 మి.లీ. కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చెయ్యాలి. ★ వర్షాలకు అపరాల పంటలకు ఆకుమచ్చ తెగులు ఆశించే ప్రమాదం ఉంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి. ★ మిరప నారుమళ్లలో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

★ అధిక వర్షాలకు మిరప నారుకు నారుకుళ్లు ఆశిస్తే 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో 2, 3 సార్లు నారుమళ్లను తడపాలి.

–న్యూస్‌టుడే, ఖమ్మం (వ్యవసాయం)

సీతాఫలం సాగు వివరాలు

సీతాఫలం ఎక్కువ వర్షపాతాన్ని, వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుంది. చౌడు, క్షార నేలల్లో తప్ప అన్ని నేలల్లో సాగు చేయవచ్చు. మురుగునీరు పోయే సదుపాయం కలిగిన చల్కా, గరప, ఎర్ర నేలలు, రాళ్లతో కూడిన కంకర నేలలు కూడా అనుకూలమే.

✦ 60×60×60 సెం.మీ. పరిమాణంలో 5×5 మీటర్ల దూరంలో గుంతలు తవ్వాలి. ఒక్కో గుంతకు 20 కిలోల పశువుల ఎరువు, కిలో సూపర్‌ఫాస్ఫేట్, 100 గ్రా. ఫాలిడాల్‌ను పొడిగుంత నుంచి తీసిన పైపొర మట్టిలో కలిపి గుంతను నింపాలి. అంటు మొక్కలను గుంత మధ్యలో నాటాలి. నాటేటప్పుడు అంటుభాగం భూమికి 15-20 సెం.మీ. పైకి ఉండేలా నాటి, మొక్కకు ఊతంగా కర్రను ఏర్పాటు చేయాలి. అంటు మొక్కల వేరుమూలంపై వచ్చే చిగుళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. సీతాఫలంలో లేత కొమ్మల మీద పూత వస్తుంది. కనుక తక్కువ స్థాయిలో కొమ్మల కత్తిరింపు చేస్తే లేత కొమ్మలు, పూత బాగావచ్చి ఎక్కువ దిగుబడి వస్తుంది. కత్తిరింపు జనవరి-మార్చి మాసాల్లో, ఆకురాల్చే సమయంలో చేయాలి.

✦ మొక్కలు నాటిన తర్వాత అవసరాన్ని బట్టి 2-3 రోజులకు ఒకసారి నీరు పారించాలి. నీరు తక్కువైతే కాయలు గట్టిగా మారి త్వరగా పండుబారతాయి. బెట్టలో మొక్కల మొదళ్లలో వరిపొట్టు, వేరుసెనగ పొట్టులాంటివి వేసి పాదుల్లో తేమను నిలుపుకోవచ్చు.

✦ కాపులో ఉన్న ఒక్కో చెట్టుకు 50 కిలోల పశువుల ఎరువు, కిలో ఆముదపు పిండి, కిలో ఎముకల పొడిని మొదళ్ల చుట్టూ గాడిచేసి జూన్-జులై మాసాల్లో వేయాలి. వీటితోపాటు 250 గ్రా. నత్రజని, 125 గ్రా. భాస్వరం, 125 గ్రా. పొటాష్ వేసుకోవచ్చు.

1 యంత్రం 19 పరీక్షలు

అందుబాటులో హెల్త్ క్యూబ్
ఏటూరునాగారం సీహెచ్‌సీలో ఏర్పాటు

జయశంకర్ భూపాలపల్లి: (ఏటూరునాగారం, న్యూస్‌టుడే)

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలకు ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు ఉన్నంతలో సేవలు అందిస్తున్నారు. వైద్యం కోసం వచ్చే రోగుల సమస్యను తెలుసుకునేందుకు ల్యాబరేటరీ పరీక్షలు కీలకం. వాటి ఆధారంగానే వైద్యం చేసి.. మందులు ఇస్తారు. కానీ ఏజెన్సీలోని ఆసుపత్రుల్లో ల్యాబ్‌లు లేవు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జిల్లా పాలనాధికారి ఆకునూరి మురళి చక్కని తలంపు చేశారు. పెద్ద పెద్ద వాణిజ్య సంస్థలు ఏటా విడుదల చేసే సీఎస్‌ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో అత్యాధునిక పరికరాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. అదే హెల్త్ క్యూబ్ పరికరం. దీని ద్వారా 33 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించవచ్చు. ప్రస్తుతం ఏటూరునాగారం సీహెచ్‌సీలో 19 పరీక్షలు మాత్రమే చేస్తున్నారు.

వైద్య రంగంలో సాంకేతికను జోడించి అద్భుత ఫలితాలను సాధిస్తున్నారు. సమయాన్ని ఆదా చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు నూతన విధానాలను అందుబాటులోకి తెస్తున్నారు. హెల్త్ క్యూబ్ ద్వారా ఏ పరీక్షనైనా క్షణాల్లో చేయొచ్చు. రెండు సెకన్ల నుంచి పది నిమిషాలలోపు పరీక్షల నివేదికలు అందిస్తారు. దీనికి ప్రత్యేక పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. 33 రకాల పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఉంది. ఆ పరికరంతో పాటు ఒక ఆండ్రాయిడ్ మొబైల్ ఉంటుంది. క్యూబ్ అనుసంధానంగా ప్రత్యేకమైన ఉపపరికరాలుంటాయి. రోగి నుంచి తీసుకున్న నమూనాలను ప్రత్యేక ఉపపరికరాల ద్వారా రసాయనాలను కలిపి క్యూబ్‌కు అనుసంధానం చేస్తారు. దీంతో వెంటనే ఫలితం వస్తుంది. బీపీ, షుగర్, డెంగీ, హెచ్‌ఐవీ, మలేరియా, టైఫాయిడ్, జాండీస్ లాంటి వ్యాధినిర్ధారణ పరీక్షలు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వినియోగిస్తున్నారు. త్వరలోనే మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం పీహెచ్‌సీ, వెంకటాపూర్ సివిల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్నారు. ఈ యంత్రం వినియోగంపై ఇప్పటికే ఆయా ఆరోగ్యకేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఏటూరునాగారం సీహెచ్‌సీలో 19 రకాల పరీక్షలు చేస్తున్నారు. త్వరలోనే అవసరాన్ని బట్టి మిగతా పరీక్షలకు సంబంధించిన ఉపపరికరాలను అందుబాటులోకి తెస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య పేర్కొన్నారు.



హెల్త్‌క్యూబ్ పరికరం



ఏటూరునాగారం సీహెచ్‌సీలో హెల్త్ క్యూబ్ పరికరంతో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మొబైల్ ల్యాబ్

మొబైల్ ల్యాబ్ వలె ఈ హెల్త్ క్యూబ్ పరికరం ఉపయోగపడుతోంది. మారుమూల ప్రాంతాల్లో ల్యాబరేటరీ సౌకర్యం లేనిచోటకు తీసుకెళ్లి ఉపయోగించవచ్చు. ఏటూరునాగారం సీహెచ్‌సీలో 19 అత్యవసర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరికరం ద్వారా 939 మందికి 2444 రోగనిర్ధారణ పరీక్షలు చేశారు. ఈనెల 17న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 70 మందికి పరీక్షలు చేసిన నివేదికలు ఇచ్చినట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. అంటే ఎంత వేగంగా పరీక్షలు నిర్వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. సాధారణ పద్ధతిలో అయితే ఆ సమయంలో పది శాతం పరీక్షలు కూడా పూర్తి కావు. సులభంగా, త్వరగా పరీక్షలు పూర్తిచేయవచ్చు.

ఆన్‌లైన్ సర్వర్‌కు అనుసంధానం

ఆన్‌లైన్ సర్వర్‌కు ఈ పరికరం అనుసంధంగా ఉంది. రోజుకు ఎన్ని పరీక్షలు నిర్వహించారు. ఎంత మందికి, ఏయే పరీక్షలు నిర్వహించారో ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ముందుగా పరీక్షకు వచ్చిన వ్యక్తి వివరాలు పొందుపరుస్తారు. ఫొటో కూడా అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత ఉపపరికరంలో రోగికి సంబంధించిన నమూనాలు ఉంచుతారు. దానిని హెల్త్ క్యూబ్‌కు అనుసంధానం చేస్తారు. దీనికి అనుసంధానమై ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్ లేదా ట్యాబ్‌లో పరీక్ష ఫలితాలు కనిపిస్తాయి. వివరాలు ప్రింట్‌తీసి వైద్యునికి అందిస్తారు.

పరీక్ష పేరు	పట్టే సమయం(సెకన్లు)
బీపీ	90
షుగర్	5
ఉష్ణోగ్రత(టెంపరేచర్)	5
పల్స్‌రేట్	10
హెచ్‌బీ(హిమోగ్లోబిన్)	5
కొలెస్ట్రాల్	5
యూరిక్ ఆసిడ్	5
హెచ్‌ఐవీ	10 నిమిషాలు
మలేరియా	10
హెచ్‌సీజీ(గర్భధారణ)	10
మూత్ర పరీక్ష	2
సిఫిలిస్(వీడీఆర్ఎల్)	10
బ్లడ్ గ్రూపింగ్	5
డెంగీ	10
గున్యా	10
హెపటైటిస్-సి	10
టైఫాయిడ్	10
ట్రోపోనిన్ (గుండెకు సంబంధించిన)	10
హెపటైటిస్-బి	10

పాలనాధికారి చొరవతో..

జయశంకర్ జిల్లా పాలనాధికారి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. వాణిజ్య సంస్థలు సామాజిక బాధ్యతగా ఏటా కొంత మొత్తాన్ని ఖర్చు చేస్తుంటారు. పాలనాధికారి అలాంటి సంస్థలతో మాట్లాడి పరికరాల ఏర్పాటుకు, నిర్వహణకు నిధులు సమకూర్చే విధంగా కృషి చేశారు. ఈ నిధులను ఐడియా సంస్థతో పాటు దిల్లీకి చెందిన పబ్లిక్ హెల్త్ టెక్నాలజీ ట్రస్ట్, ఇండో అమెరికన్ టెలీ మెడిసిన్ కార్పొరేషన్ సంస్థలు సంయుక్తంగా సమకూర్చుతున్నారు. ఒక్కో హెల్త్ క్యూబ్‌కు రూ. లక్ష వరకు ఉంటుంది. ఉప పరికరాల కోసం కూడా అదనంగా ఆయా సంస్థలే ఖర్చు చేస్తున్నారు. యంత్ర నిర్వహణ బాధ్యతను జిల్లాకు ఒక ఇన్‌ఛార్జిని కూడా వారే నియమించారు.

రోగులకు త్వరగా వైద్యసేవలు



లక్ష్మారెడ్డి, హెల్త్‌క్యూబ్ పరికరాల జిల్లా ఇన్‌ఛార్జి

వైద్యులు చికిత్సలు చేయాలంటే దాదాపుగా ల్యాబ్ పరీక్షలు తప్పనిసరి. పెద్దాసుపత్రుల్లోనే అన్ని రకాల వసతులు ఉంటాయి. మారుమూల గ్రామాల్లో ల్యాబ్ సౌకర్యాలు ఉండవు. అలాంటి ప్రాంతాల్లో హెల్త్‌క్యూబ్ చాలా ఉపయోగ పడుతుంది. కచ్చితమైన ఫలితాలు వస్తాయి.

మారుప్రాంతాల్లో ఎంతో ప్రయోజనం



అప్పయ్య, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

మారుమూల ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ల్యాబ్‌లు లేని చోట వీటి వినియోగించవచ్చు. వీటితో త్వరగా పరీక్షలు నిర్వహించవచ్చు. సమయం ఆదా అవుతుంది. ఇప్పటికే ఈ క్యూబ్‌ను వాడే పద్ధతిపై సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ఏటూరునాగారంలో మంచి ఫలితాలు వస్తున్నాయి.

కార్మికుల సమస్యలపై ఉద్యమించాలి

రంగంపేట, న్యూస్‌టుడే: వరంగల్ గ్రామీణ జిల్లాలో వస్త్రనగరి(టెక్స్‌టైల్) పార్కు పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ చేనేత కార్మికులను మభ్యపెడుతున్నారని, చేనేత కార్మికుల సమస్యలపై ఉద్యమాలు ఉద్ధృతం చేయాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం వరంగల్ మహా నగరంలోని చేనేత కార్మికులు చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయన నివాసంలో పొన్నాలను కలిశారు. సమస్యలపై ఉద్యమించేందుకు పీసీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఏఐసీసీ, పీసీసీ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతానని లక్ష్మయ్య తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, నగర కాంగ్రెస్ వర్కింగ్ అధ్యక్షుడు శ్రీహరి, వెంకటస్వామిగౌడ్, పీసీసీ కార్యదర్శులు ఈవీ శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి చిత్రం



వాహనమే పడకగది

ఫుట్‌పాత్ (రోడ్డు)పై బట్టల వ్యాపారం చేసుకునేందుకు ట్రాలీ ఆటోలో బట్టలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.. రాత్రి పడుకునేందుకు అదే ఆటోను పడకగదిగా మార్చుకుంటున్నారు. చుట్టూ దోమ తెరలు రక్షణగా ఏర్పాటు చేసుకొని నిద్రిస్తున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జయశంకర్ విగ్రహం వద్ద కనిపించిన ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' కెమెరాలో బంధించింది.

- న్యూస్‌టుడే కోల్‌బెల్ట్